ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -318 | పేజీలు - 8 | వెల - 03/- | గురువారం 5 మార్చి 2026

## మళ్లీ వెలుగులోకి ఏపీ బ్రాండ్



### 20 నెలల్లో 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించాం: సీఎం చంద్రబాబు

- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రసంగం
- గత పాలనలో పారిశ్రామిక విధ్వంసం..
- ఇప్పుడు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అని వివరణ
- పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం
- ఏపీకి క్యూ కడుతున్న ప్రపంచ స్థాయి సంస్థలు
- గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖలో భారీ కుంభకోణం
- పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పిస్తూ నిర్ణయం

**అమరావతిమార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**
ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 20 నెలల కాలంలో సాధించిన ప్రగతిని, భవిష్యత్ కార్యాచరణను ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభ వేదికగా వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఐటీ, ఉద్యోగ కల్పన, వైద్య, విద్య తదితర కీలక రంగాలపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. కేవలం 20 నెలల్లోనే రాష్ట్రంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని సీఎం అధికారికంగా ప్రకటించారు.
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని చంద్రబాబు తెలిపారు. ఎంఎస్ఎంఈ రంగంలో 2.48 లక్షలు, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 1.46 లక్షలు, వివిధ పరిశ్రమల్లో 95 వేలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో 64 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని గణాంకాలతో సహా వివరించారు. అలాగే మెగా డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్, ఇతర ప్రభుత్వ విభాగాల్లో కలిపి 30,500 ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చామని, అంతకంటే ఎక్కువ ఉద్యోగాలను కల్పించి మాట నిలబెట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీని కూడా నియమించినట్లు వెల్లడించారు.

మిగతా 2లో.

## రెండు కీలక బిల్లులకు మండలి ఆమోదం

- అసైన్డ్ భూముల బిల్లు.. గ్రామ, వార్డు సచివాలయాల బిల్లులకు ఆమోదం
- అసైన్డ్ భూములను క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు లీజుకు ఇచ్చే అవకాశం
- గ్రామ, వార్డు సచివాలయాల పేరు మార్పు



**అమరావతిమార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**
ఆంధ్రప్రదేశ్ శాసనమండలి రెండు కీలకమైన బిల్లులకు ఆమోదం తెలిపింది. అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లు, ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల పునర్వ్యవస్థీకరణ బిల్లులను మండలి ఆమోదించింది.
అసైన్డ్ భూముల సవరణ బిల్లు - 2026మంత్రి అనగాని సత్యప్రసాద్ సభలో వివరించిన ప్రకారం, ఈ సవరణ ద్వారా ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములను క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు (సౌర, పవన విద్యుత్ వంటివి) లీజుకు ఇచ్చే అవకాశం లభిస్తుంది. బంజరు లేదా చౌడు భూములుగా

మిగతా 2లో.

## ఆలమట్టి ఎత్తుపై ఏపీ అభ్యంతరం..

- కేంద్రం జోక్యం కోరిన డీకే శివకుమార్
- ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపును వ్యతిరేకిస్తున్న ఆంధ్రప్రదేశ్
- ఏపీ తీరుపై కర్ణాటక డిప్యూటీ సీఎం అసంతృప్తి
- వివాదంలో జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి
- 1.33 లక్షల ఎకరాల భూసేకరణకు కర్ణాటక నిర్ణయం



**అమరావతిమార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**
ఆలమట్టి డ్యాం ఎత్తును 524 మీటర్లకు పెంచే ప్రతిపాదనను ఆంధ్రప్రదేశ్ వ్యతిరేకించడంపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం ప్రాజెక్టు పనులు కొనసాగేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆలమట్టి డ్యాం ఎత్తును 519 మీటర్ల నుంచి 524 మీటర్లకు పెంచేందుకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వొద్దని, భూసేకరణను నిలిపివేయాలని

మిగతా 2లో.

## మండలిని కుదిపేసిన లడ్డూ వ్యవహారం



- మంత్రి అచ్చన్న క్రిస్టియన్ వ్యాఖ్యలపై మండిపడ్డ వైసిపి
- స్పీకర్ పోడియం వద్ద ఆందోళనకు దిగిన వైసిపి సభ్యులు
- అచ్చన్న క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- స్పీకర్ మోషెస్ రాజుకు మంత్రి అచ్చన్న క్షమాపణలు
- గందరగోళం మధ్య వాయిదా..

2లో.



## రాష్ట్రంలో 25 వేల మంది బోగస్ ఉద్యోగులు

- నకిలీ ఉద్యోగులను సృష్టించిన ఏజెన్సీలపై ఆడిట్ చేసి కేసులు పెట్టాలని ఆదేశం
- మార్చి 6 నుంచి 99 రోజుల పాటు 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం
- ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌పై కఠినంగా లేకుంటే కలెక్టర్లపై చర్యలని హెచ్చరిక

**హైదరాబాద్ మార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**
రాష్ట్రంలో సుమారు 25 వేల మంది బోగస్ ఉద్యోగులు ఉన్నారని, వారంతా కనీసం ఆధార్ కార్డు కూడా లేకుండా ఏళ్లుగా జీతాలు తీసుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి సంచలన విషయం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఉన్న 1.70 లక్షల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల్లో

మిగతా 2లో.



## విజయవాడ-విశాఖ మధ్య బుల్లెట్ రైలు..



2లో.

- రైల్వే శాఖ కీలక ప్రతిపాదన
- విజయవాడ-కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్ కారిడార్
- సర్వే కోసం రైల్వే బోర్డుకు చేరిన ప్రతిపాదనలు
- రాష్ట్రంలో పలు కొత్త రైల్వే లైన్ల ఏర్పాటుకు ప్రణాళికలు
- శ్రీశైలానికి రైలు మార్గం ఏర్పాటుపైనా దృష్టి

## డిజిటల్ జనగణనకు తెలంగాణ సిద్ధం..

### మే 11 నుంచి తొలి దశ

- దేశంలోనే తొలిసారిగా పూర్తి డిజిటల్ విధానంలో లెక్కింపు
- సొంతంగా వివరాలు నమోదు చేసుకునేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్
- ఏ ఒక్క ఇల్లు వదలకుండా పక్కాగా లెక్కించాలని అధికారులకు ఆదేశాలు



**హైదరాబాద్ మార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**
దేశవ్యాప్తంగా జరగనున్న జాతీయ జనాభా గణన (జనగణన) ప్రక్రియలో భాగంగా తెలంగాణలో తొలి దశ పనులను పకడ్బందీగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు, ఇతర కట్టడాల వివరాలను నమోదు చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, అన్ని శాఖల కార్యదర్శులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, కీలక మార్గదర్శకాలు జారీ చేశారు.

మిగతా 2లో.

## చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- పలమనేరు వద్ద లారీని ఢీకొన్న కారు
- అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన ఐదుగురు
- మృతుల్లో ముగ్గురు మహిళలు
- మృతులు కర్ణాటకకు చెందిన వారిగా గుర్తింపు

**పలమనేరు మార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**
భక్తుల కొంగు బంగారం కలియుగ వైకుంఠ నాథుడు కొలువై ఏడుకొండలపై కాలు మోపిన వెంకటేశ్వర స్వామి సన్నిధి తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలన్న ఆత్రుత ఆ కుటుంబ ఆశలు అర్ధాంతరంగా ముగిసిపోయాయి.

మిగతా 2లో.



## పిపిపి విధానంలో వైద్య కళాశాల పూర్తి

### మొత్తం వ్యయం రూ. 8,480 కోట్లు

### అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి సత్యకుమార్ వెల్లడి

**అమరావతిమార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**
పది వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రెండు దశల్లో నిర్మాణం చేపడుతున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. వైసీపీ అరాచక పాలన కారణంగా సీట్ల సంఖ్య 11కి పడిపోయిందని, అయినా బెదిరింపులు ఆపడం లేదని విమర్శించారు. జగన్ ప్రైవేట్ కళాశాలల మాదిరిగా ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు ఇచ్చారన్నారు. రాబోయే రెండేళ్లలో పీపీపీ విధానంలో కళాశాలలు

మిగతా 2లో.



# డిజిటల్ జనగణనకుతెలంగాణ సిద్ధం..

**మొదటిపేజీ తరువాయి**

ఈసారి జనగణన ప్రక్రియలో ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకోనుంది. దేశ చరిత్రలోనే మొదటిసారి జనాభా లెక్కలను పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో చేపట్టనున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా నేరుగా స్మార్ట్‌ఫోన్లలో వివరాలను నమోదు చేస్తారు. ఇది సమాచార సేకరణలో వేగాన్ని, కచ్చితత్వాన్ని పెంచుతుంది. అంతేకాకుండా, పౌరులు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునేందుకు “సెల్ఫ్-ఎన్యూమరేషన్“ పేరిట ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తేనున్నారు. ఈ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మే 11కి 15 రోజుల ముందు నుంచే ప్రారంభమవుతుందని సీఎస్ రామకృష్ణారావు తెలిపారు.

**పక్కాగా వివరాలు నమోదు చేయాలి: సీఎస్**

క్షేత్రస్థాయిలో వివరాల సేకరణలో ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదని సీఎస్ స్పష్టంగా ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం భౌగోళిక సరిహద్దులను కచ్చితంగా నిర్ధారించుకోవాలని సూచించారు. మారుమూల గిరిజన తండాలు, పట్టణాల్లోని మురికివాడలతో సహా రాష్ట్రంలోని ఏ ఒక్క కట్టడాన్ని కూడా వదిలిపెట్టకుండా జాబితాలో చేర్చాలని ఆయన స్పష్టం చేశారు. ఈ బృహత్కార్యక్రమం విజయవంతం కావడానికి గణకులు, పర్యవేక్షకులకు నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు.ఈ సమావేశంలో పాల్గొన్న జనాభా లెక్కల విభాగం రాష్ట్ర సంచాలకురాలు భారతీ హోళికెరి, డేటా సేకరణ కోసం రూపొందించిన మొబైల్ యాప్ పనితీరు, సమాచార భద్రతకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రతి ఒక్కరి బాధ్యతలను ఆమె విశదీకరించారు. ఈ డిజిటల్ విధానం వల్ల సమాచార సేకరణలో పారదర్శకత పెరగడంతో పాటు, భవిష్యత్ ప్రభుత్వ పథకాల రూపకల్పనకు కచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# రాష్ట్రంలో 25 వేల మంది బోగస్ ఉద్యోగులు

ఈ నకిలీ ఉద్యోగులను గుర్తించినట్లు తెలిపారు. ఇలాంటి బోగస్ ఉద్యోగులను సృష్టించి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై సమగ్ర ఆడిట్ చేయించి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆయన తీవ్రంగా ఆదేశించారు. కలెక్టర్లు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మంగళవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ‘ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక‘ కార్యక్రమాన్ని అమలు చేయడంపై ఆయన దిశానిర్దేశం చేశారు. గ్రామ సర్పంచులు, మున్సిపల్ ఛైర్మన్లు, మేయర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల భాగస్వామ్యంతో ఈ ప్రణాళికను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఈ నెల 12న జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి జిల్లాకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నోడల్ అధికారిగా నియమించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు, హెచ్చరికలు జారీ చేశారు. ధాన్యం సేకరణలో మోసాలకు పాల్పడే మిల్లర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని, వారి నుంచి ధాన్యాన్ని వెనక్కి రాబట్టాల్సిన పూర్తి బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కలెక్టర్లు, ఎస్పీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.భూభారతి దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని, ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, దానికి సంబంధించిన కార్యక్రమాలను ఒక వేడుక వాతావరణంలో జరపాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# ఆలమట్టి ఎత్తుపై ఏపీ అభ్యంతరం..

**మొదటిపేజీ తరువాయి**

కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని శివకుమార్ తెలిపారు. ఈ విషయంలో ఏపీ, మహారాష్ట్ర జోక్యం చేసుకోవడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రాజెక్టు కోసం 1.33 లక్షల ఎకరాల భూమిని సేకరించాలని తమ కేబినెట్ గత ఏడాది సెప్టెంబర్‌లోనే నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు.

2010లోనే ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం తమ వాటా నీటి వినియోగాన్ని 177 టీఎంసీల నుంచి 330 టీఎంసీలకు పెంచుకునేందుకు అనుమతి ఉందని శివకుమార్ వివరించారు. భూమి ధరలు పెరుగుతున్నందున తాము భూసేకరణ ప్రక్రియను ప్రారంభించామని, ఇది తమ రాష్ట్ర పరిధిలోనే జరుగుతోందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.20,000 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు.ఏపీ సీఎం అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడని, ఆయన ఈ విధంగా ఎందుకు వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని అన్నారు. మార్చి 10 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయని, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం కర్ణాటక ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.

## రెండు కీలక బిల్లులకు మండలి ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

ఉండి సాగుకు పనికిరాని అసైన్డ్ భూములకు ఈ లీజు ద్వారా భరోసా లభిస్తుంది. ఎకరాకు ఏడాదికి రూ. 31 వేల లీజు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి రెండేళ్లకు లీజు మొత్తాన్ని 5 శాతం మేర పెంచుతూ చట్టంలో సవరణ చేశారు.అసైనీదారుల పూర్తి అనుమతితోనే భూములు తీసుకుంటారు. ట్రై-పార్టీ అగ్రిమెంట్ (త్రిపక్ష ఒప్పందం) ద్వారా లబ్ధిదారులకు పూర్తి రక్షణ కల్పిస్తారు. ఈ చట్టంతో రాష్ట్రంలో సుమారు రూ. 10 లక్షల కోట్ల విలువైన క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల 7.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.గ్రామ, వార్డు సచివాలయాల సవరణ బిల్లు -2026

గ్రామ వార్డు స్థాయి పాలనలో మార్పులు తీసుకువస్తూ ఈ బిల్లును ఆమోదించారు. ప్రస్తుతం ఉన్న గ్రామ, వార్డు సచివాలయాలను ఇకపై ‘స్వర్ణ గ్రామం‘ మరియు ‘స్వర్ణ వార్డు‘ సచివాలయాలుగా పిలుస్తారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం.

# మండలిని కుదిపేసిన లడ్డూ వ్యవహారం

**అమరావతిమార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**ఏపీ శాసనమండలిలోగందరగోళ పరిస్థితి నెలకొనడంతో ఛైర్మన్ మోషేన్ రాజు సభను గురువారానికి వాయిదా వేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై తీవ్ర వాదోపవాదాలు నెలకొన్నాయి. ఈక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతుండగా వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. ఛైర్మన్ పోడియం ఎక్కి నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. అంతకముందు.. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో రగడ చోటుచేసుకుంది. మాజీ సీఎం జగన్‌ను క్రిస్టియన్ అంటూ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై వైసీపీ సభ్యులు ఆందోళకు దిగారు. దీంతో సభను ఒకసారి వాయిదా వేశారు ఛైర్మన్. తిరిగి మొదలైన తర్వాత కూడా.. జగన్‌కు క్షమాపణ చెప్పాలని వైసీపీ సభ్యులు నినాదాలు చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ’జగన్‌ను నేను క్రిస్టియన్ అని అన్నాను, ఆ మాటకు కట్టుబడి ఉన్నాను’ అని స్పష్టం చేశారు. జగన్ క్రిస్టియన్ కాదని చెప్పమనండి అంటూ సవాల్ విసిరారు. ’టీవీలో చూసి ఉంటారు కదా జగన్... కాదని చెప్పమనండి’ అని మంత్రి అన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు కుటుంబంతో తిరుమల దర్శనానికి ఎందుకు రాలేదని నిలదీశారు. వైసీపీ సభ్యులు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. దీంతో వైసీపీ సభ్యులు పోడియం వద్దకు వచ్చి జగన్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారం తీవ్ర వివాదంగా మారి.. పాలక, ప్రతిపక్షాల మధ్య ఆరోపణలు, విమర్శలు కొనసాగుతుండగా.. రచ్చకు దారితీసింది.. లడ్డూ అంశంపై చర్చ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్. మండలి ఛైర్మన్ మోషేన్ రాజు ఇద్దరు క్రిష్టియన్స్ అంటూ వ్యాఖ్యానించారు. అయితే, అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు ఛైర్మన్ మోషేన్‌రాజు.. తాను క్రిస్టియన్ కాదని చెప్పారు.. తాను హిందువునని తెలిపారు మండలి ఛైర్మన్.. అంతేకాదు.. తనను క్రిస్టియన్ గా మార్చాలని చూస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడమే కాకుండా.. అచ్చెన్నాయుడు క్షమాపణలు చెప్పాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు.. దీంతో, శాసన మండలిలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది.. ఈ సందర్భంగా మళ్లీ మాట్లాడిన మంత్రి అచ్చెన్నాయుడు.. తాను మండలి ఛైర్మన్ క్రిస్టియన్ అనుకున్నాను.. ఆయన తాను హిందువును అని చెప్పారు.. అందుకే నా వ్యాఖ్యలు వెనక్కు తీసుకుంటున్నాను అన్నారు.. మండలి ఛైర్మన్ కు తప్పు అయ్యిందని ఒప్పుకుంటున్నా అన్నారు అయినా, మండలిలో మంటలు తగ్గలేదు.. మొత్తంగా క్రిస్టియన్స్ వ్యవహారంలో మండలిలో రచ్చగా రేపగా.. మంత్రి అచ్చెన్నాయుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నా.. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో కాసేపు శాసన మండలి వాయిదా పడింది.. ఈ సమయంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రసంగించారు. వైసీపీ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ’రూ.320లకు కిలో ఆవు నెయ్యి ఎక్కడైనా దొరుకుతుందా?’ అని ప్రశ్నించారు. వీళ్లు హిందువులు ఎలా అవుతారంటూ వైసీపీ సభ్యులను ఉద్దేశించి అన్నారు. రూ.320లకు ఆవు నెయ్యి కొనాలని అడుగుతున్న వైసీపీ సభ్యులు.. ఎమ్మెల్సీలు ఎలా అయ్యారని నిలదీశారు. సోమువీర్రాజు మాట్లాడుతున్న సమయంలో పోడియం వద్ద వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగడంతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో ఛైర్మన్ సభను గురువారానికి వాయిదా వేశారు.

# చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**



పుణ్యక్షేత్రానికి వెళ్తున్నామని కుటుంబ సభ్యులకు చెప్పి హుషారుగా బయలుదేరిన కొద్ది గంటలకే వీరి ప్రయాణం మృత్యులోకానికి తీసుకెళ్లింది. చిత్తూరు జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఒక భయంకరమైన రోడ్డు ప్రమాదం ఐదుగురు ప్రాణాలను బలి తీసుకుంది. పలమనేరు సమీపంలోని గంగవరం వైయస్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం ఉదయం పలమనేరు సమీపంలోని జాతీయ రహదారిపై ఒక కారు అతివేగంగా ప్రయాణిస్తుంది. అయితే అదే సమయంలో ముందు వెళ్తున్న లారీని ఈ కారు వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ప్రమాదం ఎంత తీవ్రంగా జరిగిందంటే, కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. లారీ కింద భాగానికి దూసుకెళ్లింది. ఈ ఘోర ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులలో ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నట్టు పోలీసులు ధ్రువీకరించారు.

**విలవిలలాడిన ప్రాణాలు..**

గంగవరం మండల కేంద్రానికి సమీపంలో లారీ కిందికి దూసుకుపోయిన కారులో ఇరుక్కుపోయిన వారంతా ఆర్తనాదాలు పెడుతున్నారు. భారీ శబ్దానికి సమీపంలోనే ఉన్న ప్రజలు అప్రమత్తమయ్యారు. కారులో ఉన్న వారిని కాపాడేందుకు రంగంలోకి దిగారు. అతి కష్టం మీద కారులో చిక్కుకు పోయిన వారిని రక్షించడానికి తీవ్రంగా శ్రమించారు. సమాచారం అందుకున్న పోలీసులు కూడా ఘటనా స్థలానికి చేరుకొని, పరిస్థితిని సమీక్షించారు. అప్పటికే కారులో చిక్కుకున్న వారంతా ప్రాణాలు కోల్పోయిన స్థితిలో కనిపించారు.

**మృతులు బెంగళూరు వాసులు..**

స్థానికుల నుంచి జరిగిన ఘోర ప్రమాదాన్ని తెలుసుకున్న పలమనేరు పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల వద్ద ఉన్న వివరాల ఆధారంగా వారు కర్ణాటక వాసులుగా గుర్తించారు. వీరంతా బెంగళూరు నగరంలోని రాజాజీ నగర్ నివాసితులుగా పోలీసులు నిర్ధారించారు. వీరంతా కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి బెంగళూరు నుంచి బయల్దేరగా గమ్యస్థానానికి చేరుకోక ముందే ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరణించిన వారి వివరాలను పోలీసులు అధికారికంగా ప్రకటించారు. మృతుల్లో వృద్ధులతోపాటు యువతులు కూడా ఉన్నారు. మోహన్ దాస్ (71) నాగరాజారావు (61) కుసుమ (61) జయంతి (59) పూజ (33) మృతి చెందారు. ఒకేసారి కుటుంబంలోని, బంధువర్గంలోని ఐదుగురు వ్యక్తులు మరణించడంతో రాజాజీ నగర్ లో విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రాథమిక విచారణ ప్రకారం కారు డ్రైవర్ అతి వేగంగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. వేగం ఎక్కువగా ఉండటం వల్ల డ్రైవర్ నియంత్రణ కోల్పోయి, ముందు వెళ్తున్న లారీని గమనించలేక ఢీ కొట్టినట్టు పోలీసులు భావిస్తున్నారు. కారు నుంచి బయటికి తీసిన మృతదేహాలను రోడ్డుపక్కన ఉంచడం చూసిన స్థానికులు కూడా కన్నీరు పెట్టారు. గంగవరం పోలీసులు ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలను పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పలమనేరు పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు

# విజయవాడ-విశాఖ మధ్య బుల్లెట్ రైలు..

**శ్రీశైలానికి రైలు మార్గం ఏర్పాటుపైనా దృష్టి**

**అమరావతిమార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రైల్వే శాఖ కీలక ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్రంలోని రెండు ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నం మధ్య బుల్లెట్ రైలు నడిపేందుకు హైస్పీడ్ కారిడార్‌ను, మరోవైపు విజయవాడ నుంచి కర్నూలుకు సెమీ హైస్పీడ్ కారిడార్‌ను నిర్మించాలని పరిశీలిస్తోంది. వీటితో పాటు రాష్ట్రంలో మరో ఆరు కొత్త రైల్వే లైన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించింది. ఈ ప్రాజెక్టులన్నింటికీ ఫైనల్ లొకేషన్ సర్వే (ఫీూా) చేసేందుకు అనుమతి కోరుతూ అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపారు. బోర్డు నుంచి ఆమోదం లభిస్తే ఈ పనుల్లో ముందడుగు పడుతుంది.

విజయవాడ-విశాఖపట్నం మధ్య దాదాపు 350 కిలోమీటర్ల మేర ఈ హైస్పీడ్ రైల్ కారిడార్‌ను నిర్మించాలని భావిస్తున్నారు. ఇది కార్యరూపం దాల్చితే గంటకు 320 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో బుల్లెట్ రైళ్లు పరుగులు పెడతాయి. ఏలూరు, రాజమహేంద్రవరం, కాకినాడ మీదుగా ఈ మార్గాన్ని ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రం మీదుగా మూడు హైస్పీడ్ కారిడార్లకు ప్రతిపాదనలు ఉండగా, ఇది నాలుగోది కానుంది.

ప్రస్తుతం విజయవాడ నుంచి కర్నూలుకు నేరుగా రైలు సౌకర్యం లేదు. ఈ నేపథ్యంలో రెండు నగరాల మధ్య 350 కిలోమీటర్ల మేర సెమీ హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మించాలని రైల్వేశాఖ ప్రతిపాదించింది. గుంటూరు, నరసరావుపేట, మార్కాపురం, నంద్యాల మీదుగా ఈ లైన్‌ను నిర్మించనున్నారు. ఇది అందుబాటులోకి వస్తే గంటకు 220 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తూ, కేవలం 2 గంటల్లోనే విజయవాడ నుంచి కర్నూలుకు చేరుకునే అవకాశం ఉంటుంది.వీటితో పాటు పల్నాడు జిల్లా మాచర్ల నుంచి తెలంగాణలోని గద్వాల్ వరకు (184 కి.మీ.), నెల్లూరు నుంచి రాజంపేటకు (120 కి.మీ.) నేరుగా కొత్త లైన్లు వేయాలని ప్రతిపాదించారు. ముఖ్యంగా, ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలానికి రైలు సౌకర్యం కల్పించేందుకు హైదరాబాద్ నుంచి శ్రీశైలం మీదుగా మార్కాపురం వరకు కొత్త రైలు మార్గాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ఈ ప్రతిపాదనలన్నింటికీ రైల్వే బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇస్తే సర్వే పనులు ప్రారంభం కానున్నాయి.

# పిపిపి విధానంలో వైద్య కళాశాల పూర్తి

**మొదటిపేజీ తరువాయి**

పూర్తి చేస్తామని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. నాలుగు రోజుల విరామం తర్వాత ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు బుధవారం తిరిగి ప్రారంభమయ్యాయి. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలతో సభ కార్యకలాపాలను మొదలుపెట్టారు. ప్రైవేట్ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ఏర్పాటు చేయడంపై తణుకు ఎమ్మెల్యే ఏ.రాధాకృష్ణ ప్రశ్న లేవనెత్తారు. వైసీపీ హయాంలో 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రగల్భాలు పలికారని, చాలా కళాశాలల్లో పునాదులు కూడా పూర్తి కాలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం.. ప్రభుత్వ కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో సీట్లు అమ్మే పద్ధతిని తెచ్చిందని.. 10 కళాశాలలను ఆరంభించి మధ్యలో వదిలేశారని విమర్శించారు. గత ప్రభుత్వం వైద్య కళాశాలల నిధులను దారి మళ్లించిందని ఎమ్మెల్యే ఆరోపించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా బకాయిలు పెట్టిందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ఆ కళాశాలలను పీపీపీ విధానంలో త్వరగా పూర్తి చేయాలని సంకల్పించడం శుభపరిణామమని పేర్కొన్నారు. ’పీపీపీలో కళాశాలల నిర్మాణం ఎప్పుడు ప్రారంభమవుతుంది, ఎప్పుడు పూర్తవుతుందో చెప్పండి. వైసీపీ పెట్టిన సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను ఏం చేస్తారు’ అని ప్రశ్నించారు. పీపీపీలో కళాశాలలు తీసుకునే వారిని జగన్‌మోహన్ రెడ్డి బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే రాధాకృష్ణ అన్నారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సమాధానమిచ్చారు. 17 కళాశాలల్లో 11 నాబార్డు కింద, 3 కేంద్ర ప్రభుత్వం, 3 సాస్కి కింద మంజూరయ్యాయని తెలిపారు. మొత్తం వ్యయం రూ. 8,480 కోట్లు అని అన్నారు. జగన్ హయాంలో కేవలం రూ.15 వందల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని.. అందులో పులివెందుల కళాశాలకే దాదాపు రూ. 500 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ. 900 కోట్లు ఖర్చు చేసి పనులు చేపట్టిందని మంత్రి వివరించారు. కళాశాలలు నిర్మించామని వైసీపీ అసత్యాలు చెబుతోందని మంత్రి విమర్శించారు. పార్వతీపురంలో భూసేకరణ కూడా చేపట్టలేదని అన్నారు.

# మళ్లీ వెలుగులోకి ఏపీ బ్రాండ్

**మొదటిపేజీ తరువాయి**

గత ప్రభుత్వ పాలనపై విరుచుకుపడ్డ సీఎం, 2019-24 మధ్య కాలంలో ఏపీ బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో జాకీ, అమర్ రాజా, లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయాయని గుర్తు చేశారు. ఆ సమయంలో ఏర్పడిన ప్రతికూల పరిస్థితుల వల్ల 913 కంపెనీలు మూతపడ్డాయని ఆర్బీఐ నివేదికే స్వయంగా వెల్లడించిందని సభ దృష్టికి తెచ్చారు. గతంలో ‘ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‘కు చిరునామాగా ఉన్న ఏపీని, ఇప్పుడు ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‘ దిశగా మారుస్తున్నామని చెప్పారు. కేవలం 26 కొత్త పాలసీలతో వేగంగా అనుమతులు ఇస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని తెలిపారు. ఇటీవల విశాఖలో జరిగిన సదస్సులో ఏకంగా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వీటి ద్వారా భవిష్యత్తులో 16 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు.

**రాష్ట్రానికి అంతర్జాతీయ సంస్థలు**

ఎన్డీఏ కూటమి పాలనపై నమ్మకంతో ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీకి క్యూ కడుతున్నాయని చంద్రబాబు తెలిపారు. గూగుల్, టాటా-టీసీఎస్ వంటి దిగ్గజాలు విశాఖకు వచ్చాయని, త్వరలోనే ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్ డేటా సెంటర్లకు శంకుస్థాపన చేయబోతున్నామని ప్రకటించారు. అలాగే ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రూ.1.85 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్, టాటా సంస్థ ద్వారా రూ.6 వేల కోట్ల పెట్టుబడితో మరో యూనిట్ రాబోతోందని చెప్పారు. పెట్టుబడిదారులకు భరోసా కల్పించేందుకు ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సీఎం ఉద్ఘాటించారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ ఎకోసిస్టమ్, విశాఖలో ఐటీ హబ్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువత నైపుణ్యాలకు పదును పెడుతున్నామని అన్నారు.

**వైద్యం - పర్యాటకం**

రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని, పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో మెడికల్ కాలేజీలను నిర్మిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. పీపీపీ అంటే ప్రైవేట్ పరం కాదని, అది ప్రభుత్వ ఆస్తిగానే ఉంటుందని స్పష్టత ఇచ్చారు. గత పాలకులు మెడికల్ కాలేజీలకు కనీసం భూమిని కూడా చూపించలేకపోయారని విమర్శించారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. ఇక పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించామని, సూర్యలంక, గండికోట వంటి ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

**ఎక్సైజ్ ప్రక్షాళన**

గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖలో అతిపెద్ద కుంభకోణం జరిగిందని, నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని సీఎం మండిపడ్డారు. దీనిపై కేబినెట్ సబ్ కమిటీ విచారణ జరుపుతోందని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం పారదర్శక విధానంతో అంతర్జాతీయ బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. విద్యా రంగంలోనూ తెలుగు భాషను కాపాడుకుంటూనే, ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తన ప్రసంగంలో పేర్కొన్నారు.

## 26 రకాల వివరాలతో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు: సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఒకే గొడుగు కిందకు తెచ్చేలా రూపొందిస్తున్న ‘ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‘ (ఎఫ్ బీఎంఎస్)పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా అసెంబ్లీలోని తన చాంబర్‌లో అధికారులతో ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ ఐడీ, ఆధార్, రైస్ కార్డ్, మొబైల్ నెంబర్, విద్యార్హతలు, వృత్తి, చిరునామా, వ్యవసాయ భూమి, ఇతర ఆస్తుల వివరాలు వంటి మొత్తం 26 రకాల అంశాలతో పకడ్బందీగా డేటాబేస్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

ఈ డేటాబేస్ రూపకల్పన కోసం ఎస్‌జీఎస్‌డబ్ల్యూ, డిస్కమ్స్, పురపాలక శాఖ, వెబ్‌ల్యాండ్, వాహన్, హెచ్‌ఆర్ఎంఎస్, పంచాయతీరాజ్, మార్క్‌ఫెడ్ వంటి వివిధ ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని సేకరించి ఇందులో పొందుపరచాలని సీఎం సూచించారు. ప్రస్తుతం 82 శాతం సమాచారం సిద్ధంగా ఉందని, వచ్చే ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటాబేస్ పూర్తిచేస్తామని అధికారులు వివరించారు.దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. ప్రభుత్వంలోని అన్ని శాఖల వద్ద ఉన్న డేటాను సమీకృతం చేయడం ద్వారానే సమాచారంలో కచ్చితత్వం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ‘ఫ్యామిలీ కార్డు‘ అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దీనికి అనుగుణంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

# మై ఫోర్స్ మహేష్ కాదు
# బోఫోర్స్ మహేష్..!

## -- కుల రాజకీయం చేస్తున్న జనసేన నాయకుడు..!

## - 45 లక్షలు అద్దె చెల్లించకుండా యజమానికి టోకరా..









**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 04 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- సంవత్సరాల తరబడి అద్దెలు చెల్లించకుండా దౌర్జన్యానికి పాల్పడుతున్న జనసేన నేత - మై ఫోర్స్ మహేష్ పై బాధితులు ఏకధాటిగా విచ్చేసి అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి ని కలిసి తమ గోడును ఆయనకు వెలబోస్తూ ఫిర్యాదు పత్రాన్ని అందజేసి జనసేన పార్టీ నాయకుడి పై ఫిర్యాదు చేశారు. ఇక విషయానికొస్తే మదనపల్లి పట్టణంలో నివాసముంటున్న ఇంటికి, వ్యాపారం నిర్వహిస్తున్న ఎం.జి.ఆర్ హోటల్ కు అద్దెలు చెల్లించకుండా, ఖాళీ చెయ్యకుండా కుల ప్రస్తావన తెస్తూ బాధిత కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితులు వాపోయారు. ఈ సందర్భంగా బాధితులు మీడియాతో మాట్లాడుతూ జనసేన నాయకుడు మై ఫోర్స్ మహేష్ పార్టీని అడ్డం పెట్టుకుని దౌర్జన్యాలకు దిగుతున్నాడంటూ వాపోయారు. కరోనా సమయం నుంచి బాడుగ డబ్బులు చెల్లించకుండా అడిగితే దౌర్జన్యానికి పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితులు వాపోతూ న్యాయం చేయాలని ఇటు పోలీసులకు మీడియాకు అభ్యర్థించారు. బాధితుల ఫిర్యాదు మేరకు జనసేన పార్టీ మైఫోర్స్ మహేష్ స్థానిక నీరుగట్టువారిపల్లి రామాలయం వీధిలో మునిరత్నం కు చెందిన ఇంటిని నెలకు రూ.8 వేలకు అద్దెకు తీసుకొని కొన్ని నెలలుగా అద్దె చెల్లించలేదని బాధితుడు మునిరత్నం ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇప్పటివరకు మూడు సంవత్సరాలుగా రూ. 3.4 లక్షలు అద్దె బకాయి ఉన్నాడని, డబ్బు చెల్లించడు. ఖాళీ చెయ్యమన్న చేయకుండా దౌర్జన్యానికి దిగుతాడని పార్టీ పేరు చెప్పి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని మీరే తమకు న్యాయం చేయాలని బాధితుడు అభ్యర్థించాడు. మరొక్క బాధితుడు వాపోతూ ఎస్బీఐ కాలనీ వాసి సుధాకర్ రెడ్డి గొల్లపల్లె రింగ్ రోడ్డులో బిల్డింగ్ నిర్మించాడు. అందులో మొదటి రెండు ఫోర్లు మైఫోర్స్ మహేష్ ఎంజీ గ్రాండ్ పేరిట హోటల్ నిర్వహణకు భార్య సంగీతరెడ్డి పేరు మీద అద్దెకు తీసుకున్నాడు. కరోనాకు ముందు బాడుగకు తీసుకున్నాడని అప్పటి నుంచి అద్దె చెల్లించకుండా కరోనా మహమ్మారి పేరు చెప్పి నెట్టుకొచ్చాడని తర్వాత అద్దె చెల్లించమంటే జనసేన పార్టీని అడ్డం పెట్టుకుని అద్దె చెల్లించకుండా కుల ప్రస్తావన తీసుకొస్తూ ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా చెప్తూ వారిది ప్రేమ వివాహం కావున రెడ్డి ప్రస్తావన తెస్తూ జనసేన పార్టీ బీసీ పార్టీ అంటూ బలిజ పేరు చెప్పి చలామణి అవుతూ వేధిస్తున్నాడని ఆయన ఎస్సీ కులానికి చెందినవాడు కావడంతో ఎస్సీ కులం పేరు చెప్పి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని బాధితుడు సుధాకర్ రెడ్డి ఎఎస్పీ ఎదుట మొరపెట్టుకున్నాడు. ఇప్పటి వరకు ఆరు సంవత్సరాలుగా అద్దె చెల్లించకుండా రూ.45 లక్షలు అద్దె బకాయి ఉన్నాడని, ఖాళీ చెయ్యమంటే తమ్ముడు ఉమేష్ తో కలిసి దౌర్జన్యం చేస్తున్నాడని హోటల్ పైన లాడ్జి ఉందని లాడ్జి కు వచ్చే వారిని భయపెడుతూ హోటల్ కు ఎదురుగా వాహనాలు ఆపకుండా వాహనాలు నిలిపే వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారని నెల రోజులప్పుడు తంబళ్లపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎంఎన్ చంద్రశేఖర్ రెడ్డి కాల కృత్యాలు తీర్చుకోవడానికని లాడ్జికి వస్తే హోటల్ కు ఎదురుగా వాహనం ఆపాడంటూ ఆయన కారు టైర్ కు లాక్ చేసి నానా దుర్భాషలాడాడు. ఆయనపై దౌర్జన్యానికి పాల్పడి కొట్టి గాయపరిచారని బిల్డింగ్ యజమాని సుధాకర్ రెడ్డి వాపోయాడు. జనసేన పార్టీని అడ్డం పెట్టుకుని మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని తమకు మీరే తగు న్యాయం చేయాలని బాధితులు ఏఎస్పీని అభ్యర్థించారు. ఈ ఘటనపై ఏఎస్పీ వివరణ ఇస్తూ జనసేన పార్టీ నేత అన్నదమ్ములైన ఉమేష్, మహేష్ లను విచారించి బాధితులకు తగు న్యాయం చేస్తానని అడిషనల్ ఎస్పీ మీడియా ద్వారా ఇరువురికి హామీ ఇచ్చారు.

# యువతలో ఊబకాయం దేశానికి నష్టదాయకం

## ప్రపంచ ఊబకాయ దినోత్సవం సందర్భంగా దిన్నేదేవరపాడులో అవగాహన కార్యక్రమాలు






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 4)**
ఏ దేశానికైనా యువత ఉత్పాదక శక్తి అని, అలాంటి యువత ఊబకాయం బారిన పడటం దేశానికి నష్టదాయకమని కర్నూలు వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ & కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సింధియా శుభప్రద అన్నారు.ప్రపంచ ఊబకాయ దినోత్సవం పురస్కరించుకుని మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో దిన్నేదేవరపాడు గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ మరియు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ ఏపీ చాప్టర్ పిలుపు మేరకు ఈ కార్యక్రమాలు చేపట్టారు.

విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ సింధియా శుభప్రద మాట్లాడుతూ, విద్యార్థులు శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. యువతకు తమ శరీర నిర్మాణం, తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, వాటి లాభనష్టాలపై సరైన అవగాహన కలిగితే వారు కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించగలరని తెలిపారు. తద్వారా కుటుంబం, సమాజం, దేశం ఆరోగ్యవంతంగా మారుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పుష్పలత పీజీ వైద్యులను రెండు బృందాలుగా విభజించారు. ఒక బృందం గ్రామ పెద్దలకు బాడీ మాస్ ఇండెక్స్ (బిఎమ్ఐ) కొలతలు తీసి, ఊబకాయం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించింది. మరో బృందం గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు యువతలో పెరుగుతున్న ఊబకాయం, జంక్ ఫుడ్స్ దుష్ప్రభావాలు, తీసుకోవాల్సిన సమతుల్య ఆహారం గురించి వివరించింది.

కార్యక్రమంలో దిన్నేదేవరపాడు గ్రామ సర్పంచ్ మాధవస్వామి, జిల్లా పరిషత్ హైస్కూల్ ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ యాసీన్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. అరుణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు హేమచంద్రరెడ్డి, పీజీ డాక్టర్లు డా. కార్తీక్, డా. సబిహ, డా. నుస్రత్, డా. సౌమ్య, డా. సభా, డా. పూజ, హెల్త్ ఎడ్యుకేటర్ షణ్ముఖుడు, హెల్త్ సూపర్వైజర్లు సాయిరాం, మాధవరాజు, హెల్త్ అసిస్టెంట్లు నాగేశ్వరమ్మ, సుభాషిని, శ్రీదేవి, ఆశా కార్యకర్తలు పద్మ, సుజాత, మాధవి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ స్థాయిలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం ద్వారా ఊబకాయ సమస్యను నియంత్రించవచ్చని వైద్యులు సూచించారు.




# జనసేన ఉద్యమి కార్యక్రమంలో మండల కన్వీనర్ కే. చిరంజీవి





**చిప్పగిరి, మార్చి, 4,( రిపబ్లిక్ న్యూస్)**
చిప్పగిరి మండలం జనసేన మండల కన్వీనర్ గుంతకల్ జరుగు జనసేన ఉద్యమి కార్యక్రమంలో కె. చిరంజీవి పాల్గొన్నారు, విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హస్తకళా కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ను కలిసి మండల సమస్యలు గురించి వివరించానని, చిప్పగిరి మండల జనసేన నాయకులు నేటి నుండి జనసేన ఉద్యమి సభ్యత్వం తీసుకోవాలని కేవలం సభ్యత్వం మాత్రమే కాదని, మీ భవిష్యత్తుకు ఒక భరోసా, మీ కుటుంబానికి ఒక అండ అని, ప్రతి ఒక్కరు సభ్యత్వం నమోదు చేసుకోవాలని మండల కన్వీనర్ కె చిరంజీవి కోరారు.

# ఆశా వర్కర్ల నిర్బంధం..

## 5న చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న ఆశా వర్కర్లను ఎక్కడికక్కడ అడ్డుకొని నిర్బంధించిన పోలీసులు..










**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 04 - (రిపబ్లిక్ న్యూస్) -**
ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమానికి ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయు రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చింది. వారి పిలుపు మేరకు ఆశా కార్యకర్తలు బుధవారం విజయవాడ కు బయలుదేరేందుకు ములకలచెరువు రైల్వే స్టేషన్ కు చేరుకున్నారు. అంతలోనే ములకలచెరువు పోలీసులు విజయవాడకు వెళ్ళనీయకుండా అడ్డుకున్నారు. ములకలచెరువు పోలీస్ స్టేషన్ కు తరలించి ఆశాలను నిర్బంధించారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి, నిమ్మనపల్లి, రామసముద్రం, వాయల్పాడు, గుర్రంకొండ, కురబలకోట, తంబళ్లపల్లి, పెద్దమండ్యం మండలాలకు చెందిన ఆశా కార్యకర్తలను సిటియం రైల్వే స్టేషన్ లో అడ్డుకున్నారు. ఇక ములకళచెరువు, పిటిఎం, బి.కొత్తకోట మండలాలకు చెందిన ఆశాలను ములకళచెరువు రైల్వే స్టేషన్ కు వస్తుండగా పోలీసులు విచ్చేసి వీరిని పోలీస్ స్టేషన్ కు తరలించి నిర్బంధించారు. చలో విజయవాడకు వెళ్ళనీయకుండా ఆశా వర్కర్లను ఆయా మండలాల్లో పోలీసులు ఆశాలను నిర్బందించారు. ములకలచెరువు ఆశా కార్యకర్తల సంఘం నాయకులు లక్ష్మిదేవి, అమరావతి లను ఉదయం 10 గంటలకు అదుపులోకి తీసుకొని రాత్రి 9 గంటలకు విడిచిపెట్టారు. పోలీసుల నిర్బందాన్ని లెక్కచేయకుండా ఆశా కార్యకర్తలు విజయవాడ కు వెళ్లే నరసాపురం ఎక్స్‌ప్రెస్ లో చలో విజయవాడ కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.జయమ్మ, ఎస్.మెహరున్నిషా లు మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణ పేరుతో నియమింపబడిన ఆశా వర్కర్లతో ప్రభుత్వం అన్ని పనులను చేయించుకుంటుందని ఆరోపించారు. సర్వేల పేరుతో పని భారాన్ని పెంచుతున్నారని, తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని, ఆశా వర్కర్లకు సంబంధం లేని పనుల సైతం బలవంతంగా బెదిరించి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీహెచ్ సీ, యూపీ హెచ్ సీ, వెల్నెస్ సెంటర్స్‌ను క్లీనింగ్ చేయించడం, బాత్రూములు కడిగించడం, బూజులు దులిపించడం వంటి అవమానకరమైన పనులు కూడా చేయిస్తున్నారని, కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన ఆశాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ హెల్త్ ఆర్గనైజర్‌గా గుర్తింపునిస్తే ఆశా వర్కర్ల సేవలను గుర్తించలేని, గౌరవించలేని గుడ్డి ప్రభుత్వాలుగా యూపీఏ మోదీ ప్రభుత్వం ఇటు కూటమి ప్రభుత్వాలు ఉన్నాయని ఆశా వర్కర్లు ఆరోపించారు. పెరుగుతోన్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశాలపై నిర్భందాన్ని ప్రయోగిస్తే ఇంటికి సాగనంపుతామని హేచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మంజుల, సుజాత, రమాదేవి, శ్రావణి, రాధమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు..

# కులమతాల పేరుతో కించపరచడం మండలి కి అవమానం..!

## వైఎస్ జగన్, మండలి చైర్మన్లు కుల ప్రస్తావన తెచ్చి క్రిస్టియన్లుగా సంబోధించడం ఎంత వరకు సబబు.. -గడికోట శ్రీకాంత్ రెడ్డి




**ఏపీ బ్యూరో, మార్చి 04 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న మండలి చైర్మన్ కు మతం, పార్టీ ఆపాదిస్తూ మాట్లాడిన సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని, సభలో అడుగుపెట్టకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయనపై చర్యలు తీసుకోవాలని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం ఇన్నాళ్లు దేవుడిని రాజకీయాల్లోకి లాగి ఆలయ ప్రతిష్టను మసకబార్చిన కూటమి నాయకులు మాట్లాడాల్సిన సబ్జెక్టును పక్కన బెట్టి శాసనమండలి చైర్మన్‌ని చర్చలోకి లాక్కురావడమే కాకుండా ఆయన్ను కులమతాల పేరుతో కించపరచడం దారుణమని ఆయన ఆక్షేపించారు. రాజ్యాంగ వ్యవస్థలో ఈరోజును చీకటిరోజుగా చూడాలని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి పేరుతో టీటీడీ నిధుల దోపిడీకి పాల్పడిన హెరిటేజ్ అంశం మండలిలో చర్చకు రావడంతో దానికి సమాధానం చెప్పలేక సభలో లేని వైఎస్ జగన్, మండలి చైర్మన్లు క్రిస్టియన్లు అని మాట్లాడుతూ సభను పక్కదారి పట్టించే ప్రయత్నం చేయడం అత్యంత హేయమైన చర్య అని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. పైగా మీ నాయకుడు జగన్ అంటూ మండలి చైర్మన్‌కు పార్టీని ఆపాదించి అవమానించారు. ఇది దారుణమన్నారు. ఇందాపూర్ డెయిరీ ముసుగులో హెరిటేజ్ చేసిన టీటీడీ నిధుల దోపిడీపై వైయస్ఆర్‌సీపీ సభ్యులు ప్రశ్నిస్తుంటే వాటికి సమాధానం చెప్పుకోలేని ప్రభుత్వం సభను పక్కదోవ పట్టించడానికి చైర్మన్‌ను రాజకీయాల్లోకి లాగి మతాన్ని, పార్టీని ఆపాదించిందని శ్రీకాంత్ రెడ్డి దుయపట్టారు.

**అచ్చెన్నాయుడిపై చర్య తీసుకోవాలని డిమాండ్..**
ఇప్పటికైనా సీఎం చంద్రబాబు కలగజేసుకుని మంత్రి అచ్చెన్నాయుడిని రాబోయే మూడేళ్లపాటు సభలో అడుగుపెట్టకుండా శాశ్వతంగా సభ నుంచి సస్పెండ్ చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటిస్తే సరిపోదని ఆయన తన పదవికి రాజీనామా చేయాలని తెలుగుదేశం పార్టీ నుంచి ఆయన్ను సస్పెండ్ చేయాలని శ్రీవారిని రాజకీయాల్లోకి లాగినందుకు కూటమిని ప్రజలు అసహ్యించుకుంటుంటే దాన్నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు కులమతాలతో రాజకీయాలు చేయడం అత్యంత హేయమైన చర్యనని శ్రీకాంత్‌రెడ్డి అభివర్ణించారు..

# విధవరాలి భూమిపై రియల్ ఎస్టేట్ యజమాని కబ్జా ఆరోపణలు

## 5.22 ఎకరాల భూమిపై మోసం చేసి ఆన్‌లైన్ నమోదు చేశారంటూ దేవమ్మ ఆవేదన

## హైకోర్టు స్టేటస్ క్వో పేరుతో పంట నాశనం చేశారన్న ఆరోపణ

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 4)**

కర్నూలు జిల్లా కర్నూలు మండలం రుద్రవరం గ్రామానికి చెందిన యం.దేవమ్మ అనే విధవరాలు తన కుటుంబానికి ఏకైక ఆధారమైన వ్యవసాయ భూమిని రియల్ ఎస్టేట్ వెంచర్ యజమాని మోసం చేసి కబ్జా చేశాడని ఆరోపిస్తూ న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు.

దేవమ్మ తెలిపిన వివరాల ప్రకారం, సర్వే నెం. 727/1లో 4.09 ఎకరాలు పూర్వీకుల ఆస్తిగా ఉండగా, పక్కనే ఉన్న సర్వే నెం. 722/28లో 1.13 ఎకరాలను ఆమె భర్త లేట్ యం.భాస్కర్ కొనుగోలు చేశారు. మొత్తం 5.22 ఎకరాలలో బోర్ వేయించి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ వచ్చారు. 2020 డిసెంబర్ 4న భర్త మరణించడంతో కుటుంబ బాధ్యతలు పూర్తిగా దేవమ్మపై పడ్డాయి.సుమారు 15 సంవత్సరాల క్రితం "ఏఎస్ఆర్వై రెసిడెన్సీ" పేరుతో ప్రారంభమైన రియల్ ఎస్టేట్ వెంచర్ యజమాని జిలానీ బాషా, తమ భూమిని అమ్మాలని ఒత్తిడి తెచ్చాడని ఆమె ఆరోపించారు. ఒప్పుకోకపోయినా మోసం చేసి 1.13 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయించుకుని, 16 లక్షల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకుని కేవలం 6 లక్షలు మాత్రమే చెల్లించి మిగతా మొత్తాన్ని ఇవ్వలేదని తెలిపారు.




ఇదే క్రమంలో సర్వే నెం. 722/1లో ఉన్న 4.09 ఎకరాల భూమిని కూడా రెవెన్యూ రికార్డుల్లో తన పేరుమీద ఆన్‌లైన్ చేయించుకున్నాడని దేవమ్మ వాపోయారు. ఈ విషయమై తహసీల్దార్ కార్యాలయంలో సర్వే చేయమని ఆమె వినతి పెట్టుకున్నారు.అదేవిధంగా, హైకోర్టులో దాఖలైన డబ్ల్యూ పి. నెం 26634/2024 కేసులో స్టేటస్ క్వో ఆర్డర్ ఉందని చెబుతూ 02-02-2026న డోజర్లు పెట్టించి పంటను తొలగించారని, తనకు మరియు పిల్లలకు ఆర్థిక నష్టం కలిగించారని ఆరోపించారు. అంతేకాక తన కుటుంబంపై క్రిమినల్ కేసులు నమోదు చేయించారని కూడా పేర్కొన్నారు.

మూడు తరాలుగా సాగుచేస్తున్న సర్వే నెం. 722/1లో 4.09 ఎకరాల భూమిని తన పేరుమీద పట్టా చేసి రెవెన్యూ రికార్డులు సరిచేసి న్యాయం చేయాలని దేవమ్మ అధికారులను వేడుకున్నారు. విధవరాలైన తనకు, తండ్రి లేని తన పిల్లలకు న్యాయం జరిగేలా తక్షణమే విచారణ జరిపించాలని ఆమె కోరుతున్నారు.

# కర్నూలులో డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిసిన టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ

**శాంతి భద్రతలపై చర్చ ప్రజా సమస్యలు, పార్టీ కార్యక్రమాల భద్రతా చర్యలపై సమన్వయం**

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 4)**



కర్నూలులో ని క్యాంప్ కార్యాలయంలో కోయ ప్రవీణ్ (డీఐజీ)ను గుడిసె ఆది కృష్ణమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతల పరిస్థితులు, ప్రజలకు సంబంధించిన వివిధ సమస్యలు, అలాగే రాజకీయ పార్టీ కార్యక్రమాల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం.జిల్లాలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలను శాంతియుతంగా పరిష్కరించేందుకు పోలీస్ శాఖతో సమన్వయంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని డీఐజీని కోరినట్లు తెలిపారు.ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన కర్తవ్యమని, సమాజంలో శాంతి, భద్రతలు కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని డీఐజీ హామీ ఇచ్చినట్లు తెలిసింది.

# అనంతగిరి శిబిరంలో కాంగ్రెస్‌కు కొత్త దిశ

**రాహుల్ గాంధీతో కర్నూలు డీసీసీ అధ్యక్షుల భేటీ గ్రామ స్థాయి బలోపేతంపై స్పష్టమైన మార్గదర్శనం**




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 4)**

తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల రాజకీయ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా అనంతగిరి హిల్స్‌లో నిర్వహించిన 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమం కాంగ్రెస్ పార్టీకి కొత్త దిశను నిర్దేశించింది. ఫిబ్రవరి 21 నుండి మార్చి 2 వరకు జరిగిన ఈ శిబిరంలో కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, న్యాయవాది క్రాంతి నాయుడు బోయ మరియు కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కర్నూలు జిల్లా పార్టీ పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై డీసీసీ అధ్యక్షులతో ప్రత్యేకంగా చర్చించారు. జిల్లా స్థాయిలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయన దిశానిర్దేశం చేశారు.

శిబిరం చివరి రోజున ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వై. ఎస్. షర్మిల ముఖ్య అతిథిగా హాజరై గ్రామ స్థాయి నుండి పార్టీ నిర్మాణాన్ని బలపర్చే వ్యూహాలను వివరించారు. ముఖ్యంగా బూత్ స్థాయి కమిటీల బలోపేతం, కార్యాచరణలో క్రమశిక్షణ, ప్రజా సమస్యలపై తక్షణ స్పందన వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకత్వం అందించారు.రాహుల్ గాంధీతో గడిపిన క్షణాలు నాయకత్వంలో ఉన్న నిజాయితీ, వినయం, ప్రజల పట్ల ఉన్న సేవాభావాన్ని ప్రతిబింబించాయని జిల్లా నాయకులు పేర్కొన్నారు. ఆయన మాటలో, చూపులో కనిపించే నిస్వార్థత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ఆదర్శమని అన్నారు.

గ్రామ స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మిస్తూ, ప్రజా ఉద్యమాలను శక్తివంతం చేసి, రాష్ట్ర హక్కుల సాధనలో సమిష్టి కృషి చేయడం తమ ముఖ్య లక్ష్యమని కర్నూలు జిల్లా కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.

# కర్నూలు జిల్లా కోర్టుల్లో భద్రత కట్టుదిట్టం

**విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో ప్రత్యేక తనిఖీలు -జడ్జి రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ఏర్పాట్ల సమీక్ష**

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 4)**

జిల్లా కేంద్రంతో పాటు పరిధిలోని అన్ని కోర్టు ఆవరణల్లో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేయాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఈ తనిఖీల్లో కర్నూలు ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, హోంగార్డు డీఎస్పీ ప్రసాద్ పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణంలోని సీసీ కెమెరాల పనితీరు, నిఘా వ్యవస్థ, ప్రవేశనిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ ప్రదేశాలు తదితర అంశాలను సమీక్షించారు.






భద్రత పరంగా సీసీ కెమెరాల ఏర్పాటు, పర్మనెంట్ సెక్యూరిటీ యూనిట్లు, ప్రత్యేక సెక్యూరిటీ రూములు, గస్తీ విధులు, ప్రవేశనిష్క్రమణ గేట్ల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలపై అధికారులకు అవసరమైన సూచనలు అందించారు. కోర్టు విచారణలకు హాజరయ్యే ఖైదీల భద్రతా ఏర్పాట్లపై కూడా సమగ్రంగా ఆరా తీశారు.

కోర్టు ప్రాంగణంలో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు ప్రజలను కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు ఎఓ సుధాకర్, స్పెషల్ బ్రాంచ్ సిఐ మధుసుధన్ రావు, కోర్టు మానిటరింగ్ సిఐ రామయ్యనాయుడు, కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసమే విజయానికి తొలి అడుగు

**విద్యార్థినుల భద్రత, ఆత్మరక్షణపై చైతన్య స్కూల్‌లో అవగాహన కార్యక్రమం**








**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 4)**

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా కర్నూలు పట్టణంలోని కప్పల్ నగర్‌లో ఉన్న చైతన్య స్కూల్‌లో విద్యార్థినుల భద్రత, ఆత్మరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని పోలీసులు ఏర్పాటు చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ఆత్మవిశ్వాసం అత్యంత ముఖ్యమన్నారు. కాన్ఫిడెన్స్ లెవెల్ పెంచుకోవాలంటే నిరంతర సాధన అవసరమని, ఏకాగ్రతతో కృషి చేస్తే లక్ష్యాలను సులభంగా సాధించవచ్చన్నారు.

మనసును దృఢంగా ఉంచుకుని పట్టుదలతో ముందుకు సాగాలని సూచించిన ఆయన, విద్యార్థులు ప్రతిరోజూ సాధన చేస్తూ తమపై నమ్మకం పెంపొందించుకోవాలన్నారు. విద్యతో పాటు మంచి నైతిక విలువలను అలవర్చుకుని బాధ్యతగల పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.బాలికలు అన్ని రంగాల్లో రాణించగల సామర్థ్యం కలవారని, ధైర్యంగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ప్రతి విద్యార్థిని ఆత్మరక్షణ విద్య తప్పనిసరిగా నేర్చుకోవాలని కరాటే మాస్టర్లు సూచించారు.కార్యక్రమంలో భాగంగా ఒంటరిగా ఉన్నప్పుడు లేదా బయటకు వెళ్తున్నప్పుడు ఎదురయ్యే ప్రమాదాల నుండి ఎలా రక్షించుకోవాలో ప్రత్యక్ష ప్రదర్శన (డెమో) నిర్వహించారు. ఆత్మరక్షణకు సంబంధించిన ముఖ్యమైన టెక్నిక్స్‌ను విద్యార్థినులకు వివరంగా చూపించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ రామయ్యనాయుడు, టూ టౌన్ సిఐ నాగరాజా రావు, ఎస్సై శివాంజల్, చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ మంజుల, ఏఓ పరమేశ్వర్ రెడ్డి, కరాటే మాస్టర్లు శ్రీనివాసులు, ఫాతిమా, ఉపాధ్యాయులు మరియు సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# విధుల్లో అలసత్వం అస్సలు సహించము

**: కమిషనర్ పి. విశ్వనాథ్ హెచ్చరిక**

**సచివాలయాలపై ఆకస్మిక తనిఖీలు**

**క్రమశిక్షణ, పారదర్శకతపై కఠిన ఆదేశాలు**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 4)**

ఉద్యోగులు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ స్పష్టం చేశారు. బుధవారం రామలింగేశ్వర్ నగర్ 115వ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు.అనుమతి లేకుండా అడ్మిన్ సెలవు నమోదు చేయడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. హాజరు రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్, టీకాల నమోదు పత్రాలు, పింఛన్ల పంపిణీ రికార్డులను స్వయంగా పరిశీలించారు. విధుల నిమిత్తం కార్యాలయం బయటకు వెళ్లే ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు సంబంధిత వాట్సాప్ గ్రూపులో లొకేషన్, ఫోటోలు అప్లోడ్ చేయాలని ఆదేశించారు.పింఛన్ల పంపిణీ పూర్తైన వెంటనే మిగిలిన నగదును ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలని, వ్యక్తిగత ఖాతాల ద్వారా ఎలాంటి లావాదేవీలు నిర్వహించరాదని స్పష్టంగా తెలిపారు. విధుల్లో ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.







సచివాలయంలో పెండింగ్‌లో ఉన్న పియూపి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, శాశ్వత భవనంలో బాత్రూంలు సహా మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు.

ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయడంతో పాటు ప్రజలకు అందించే ప్రతి సేవను నిర్దిష్ట గడువులోగా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి పరిష్కరించాలని, కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని కమిషనర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అమినిటీస్ కార్యదర్శి బి. ఉదయ్ కుమార్, డబ్ల్యూపిఓ కె. సుబ్రద, ఎఎన్ఎం షాహా తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ - 2026 పోస్టర్ ల ఆవిష్కరణ

**ఆవిష్కరించిన జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్**




**అనంతపురం కలెక్టరేట్ , మార్చి 05,( రిపబ్లిక్ న్యూస్ ):**

అనంతపురం కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో బుధవారం రాఘవేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, ఎన్.ఎస్.ఎస్ విభాగం, మై భారత్, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న' జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2026' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆవిష్కరించారు.

**నాయకత్వ లక్షణాలను యువత పెంపొందించుకోవాలి**

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యువతలో నాయకత్వ లక్షణాలను, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ జిల్లా స్థాయి పోటీలను రైపర్ కళాశాల వేదికగా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.ఇప్పటికే 'మై భారత్'పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్న విద్యార్థులు అందరూ మార్చి 5న ఉదయం నిర్ణీత సమయానికి రైపర్ కళాశాలలోని పోటీ వేదికకు చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు.ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం డిడిఓ శ్రీనివాస్, రైపర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.వై.పద్మనాభ రెడ్డి, రైపర్ వైస్ ప్రిన్సిపాల్ డా. జె.రవీంద్ర రెడ్డి, జేఎన్టీయూఏ ఎన్.ఎస్.ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.మమత, మై భారత్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ బిసతి భరత్, మై భారత్ అకౌంట్స్ అండ్ ప్రోగ్రామ్ సూపర్‌వైజర్ జి.శ్రీనివాసులు, రైపర్ ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.నాగశుభ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో టపాసుల తయారీ, విక్రయాలపై ఆంక్షలు..

## - తనిఖీలు పూర్తయ్యే వరకు బాణసంచా కేంద్రాలను మూసివేయాలని జిల్లా ఎస్పీ ఆదేశాలు..

## - నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.. ధీరజ్ కునుబిల్లి

**అన్నమయ్య జిల్లా బ్యూరో, మార్చి 04 - (రిపబ్లిక్ న్యూస్) -**
మదనపల్లి :- ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడమే పోలీస్ శాఖ ప్రథమ కర్తవ్యమని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా వేట్లపాలెంలో జరిగిన బాణసంచా ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా టపాసుల తయారీ కేంద్రాలు, విక్రయశాలలపై తక్షణమే కఠిన నిబంధనలు అమలు చేస్తున్నట్లు బుధవారం ఆయన వెల్లడించారు.. తనిఖీలు పూర్తయ్యే వరకు జిల్లాలోని అన్ని బాణసంచా కేంద్రాలను తాత్కాలికంగా మూసివేయాలని ఎస్పీ ఆదేశించారు.

**సంయుక్త తనిఖీలు.. ముమ్మర నిఘా..**
జిల్లాలోని మదనపల్లి, రాయచోటి సబ్-డివిజన్ల పరిధిలో రెవెన్యూ, అగ్నిమాపక శాఖల సమన్వయంతో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు.
ప్రధానంగా కింది అంశాలపై అధికారులు దృష్టి సారించారు..

**లైసెన్సుల పరిశీలన..**



"కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన పెట్రోలియం మరియు పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (ౡజుూూ) నిబంధనల ప్రకారం బాణసంచా నిల్వ కేంద్రాలకు ఖచ్చితంగా లైసెన్స్‌లు ఉండాలి."
ఎక్స్‌ప్లోజివ్ రూల్స్, ౡజుూూ నిబంధనల ప్రకారం చెల్లుబాటు అయ్యే లైసెన్సులు ఉన్నాయా? లేదా? అని తనిఖీ చేస్తున్నారు.

**భద్రతా ప్రమాణాలు..**
గోడౌన్లలో తగినంత ఇసుక, నీరు, అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉండాలి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా 'స్పార్క్-ప్రూఫ్' సిస్టమ్స్ ఉండాలని స్పష్టం చేశారు.

**నిఘా నేత్రం..**
ప్రతి విక్రయశాల వద్ద తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి ఫీడ్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుసంధానించాలని ఆదేశించారు.

**పరిమితి దాటితే సీజ్..!**
అనుమతించిన పరిమితికి మించి బాణసంచా నిల్వ చేస్తే వాటిని వెంటనే సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. తయారీ కేంద్రాల్లో కార్మికులు సింథటిక్ దుస్తులు కాకుండా కాటన్ దుస్తులనే ధరించాలి. నిబంధనల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదు" అని ఎస్పీ గారు హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎవరైనా అక్రమంగా టపాసులు నిల్వ చేస్తే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు..

# గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత మాస్టర్ టైలర్ శిక్షణ,

**ఓబులవారిపల్లి మార్చి 4 రిపబ్లిక్ న్యూస్.**



మండల కేంద్రం రైల్వే కోడూరు స్థానిక గిరిజమ్మ వీధిలోని గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ టైలరింగ్ శిక్షణా కేంద్రము నందు నారీ నైపుణ్యం ప్రాజెక్ట్ ద్వారా మహిళలకు మాస్టర్ టైలర్ కోర్సు నందు ఉచిత శిక్షణ కొరకు మహిళలనుండి విశేషస్పందన లభించిందని ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారథి తెలిపారు. మొదటి ఇంటర్వ్యూ కొరకు 68 మంది మహిళలు హాజరు కాగా రెండవ ఇంటర్వ్యూ కొరకు 15 మంది అవకాశం పొందారని వీరిలో కొంతమందిని ఎంపిక చేసి ఈ నెల 8వ తేదీన శిక్షణ ప్రారంభిస్తామన్నారు. అధునాతన పద్ధతులలో శిక్షణ ఇవ్వడమే కాకుండా శిక్షకురాలిగా, బోటిక్ నిర్వాహకురాలిగా పాటించాల్సిన పద్ధతుల గురించి నేర్పిస్తామన్నారు. ఇప్పటి వరకు మహిళా టైలర్ లను తయారుచేశామని, మాస్టర్ టైలర్ కోర్సు ద్వారా మాస్టర్ గా, ట్రైనర్ గా, మహిళా వ్యాపార వేత్తగా ఎదిగేందుకు అవకాశముందన్నారు. శిక్షణా సమయంలో పదివేల రూపాయలు విలువగల టైలరింగ్ మెటీరియల్స్ టూల్ కిట్ ను మరియు శిక్షణ అనంతరం ఇరవై ఐదువేల రూపాయలు విలువ గల ఇండస్ట్రియల్ కుట్టు మెషిన్ ఉచితంగా ఇస్తున్నామన్నారు.అనంతరం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా కో ఆర్డినేటర్ శ్రీహరి ద్వారా మహిళలకు ఆర్థిక క్రమశిక్షణపై, పొదుపు, భీమా, బ్యాంకింగ్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా ట్రైనర్ లు కావేరి, సుప్రియ పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ భూములు అగ్రకులాల ఆక్రమణ

## చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు,

### దళిత సంఘాల నిరసన.

**ఓబులవారిపల్లి మార్చి4 రిపబ్లిక్ న్యూస్.**
ఎస్సీ ఎస్టీ దళిత కులాలకు చెందిన భూములను అగ్రకులాల దుర హంకారులు,దుర్మార్గంగా,దౌర్జన్యంగా అన్యాయంగా అక్రమంగా,దళితుల పేర్లపై ఉన్న భూములను ఆక్రమించుకొని సొంతం చేసుకుంటే రెవెన్యూ అధికారులు తెలిసి తెలియనట్లు వ్యవహరిస్తూ చోద్యం చూస్తున్నారు అని రాష్ట్ర దళిత సంఘాలు ఆరోపిస్తూ తీవ్ర నిరసన తెలియజేస్తున్నామన్నారు, రెవిన్యూ అధికారులు ఇకనైనా కళ్ళు తెరిచి వాస్తవాలను తెలుసుకొని భూమిలేని నిరుపేదల భూములను వారికి తిరిగి ఇప్పించవలసినదిగా కోరుతున్నామని రాష్ట్ర అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షుడు పోలంరెడ్డి మల్లికార్జున, రాష్ట్ర మాల మహానాడు ప్రధాన కార్యదర్శి జయరాజ్, రాష్ట్ర అంబేద్కర్ సేవా సమితి ప్రధాన కార్యదర్శి ముత్యాల గాజుల శీను, ఉపాధ్యక్షులు చంద్రమౌళి,రాష్ట్ర బహుజన సంఘం కార్యదర్శి కూని లక్ష్మీనారాయణ కోరారు

వివరాల్లోకి వెళితే

ఓబులవారిపల్లి మండలము బొమ్మ వరం పంచాయతీ శేషక్కగారిపల్లి కి చెందిన నాగిశెట్టి రమణయ్య కుమారుడు చంద్రమౌళి ఎస్సీ ఎస్టీ పేర్లతో ఉన్న భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకొని చదును చేసుకున్నారు సర్వేనెంబర్ 1138/6 విస్తీర్ణం 1,50 సెంట్లు లెక్కన మొత్తం ఆరు సబ్ డివిజన్ లు,ఉన్నటువంటి 8.38 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనది రెవిన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందని, మండల



రెవెన్యూ ఉన్నతాధికారులు సహకారంతో ఆధార్ కార్డులు సబ్మిట్ చేయకుండానే ఇతనికి రీ సర్వే చేయించడం జరిగినది, అందులో గుట్ట బాలుని చదును చేసి అందులో యంత్రాలతో త్రవ్వి గ్రవెల్ ఖనిజాలను వెలికి తీసి ఆక్రమముగా తరలిస్తూ వ్యాపారం చేస్తున్నాడు,ఇదేమి అన్యాయం అని దళిత సంఘాలు ప్రశ్నించగా, మీకు ఇష్టం వచ్చింది చేసుకోండి నాకు తెలుగుదేశం పార్టీ నాయకుల అండ, రెవిన్యూ అధికారుల దండ రెండు ఉన్నాయని దురుసుగా ప్రవర్తించాడని దళిత సంఘాలు ఆరోపించాయి రైల్వే కోడూరుకు చెందినటువంటి టిడిపి నాయకుడు పేరు చెప్పి బ్లాక్ మెయిల్కు పాల్పడుతున్నారన్నారు,ఇదేనా కూటమి ప్రభుత్వ ప్రజా పాలన,? ఎస్సీ ఎస్టీ పేర్ల మీద ఉన్న భూ మూల ఆక్రమణకు పాల్పడి ఇదేమి అన్యాయమని ప్రశ్నిస్తే టిడిపి పార్టీకి చెందిన నాయకుని పేరు చెప్తు బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఇతని పైన జిల్లా ఉన్నత అధికారులు



జిల్లా కలెక్టర్ వారు జాయింట్ కలెక్టర్ తక్షణమే స్పందించి దళితుల పేర్ల మీద ఉన్న భూములను, ఆయ వ్యక్తులను విచారించి తగిన న్యాయం చేయాలని దళిత సంఘాలు కోరుతున్నాయి, అలాచేయని పక్షంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తామని తెలియజేస్తూ ఎస్సీ ఎస్టీలకు న్యాయం జరిగే వరకూ ఈ పోరాటం ఆపమని అధికారులు దృష్టి సారించి వెంటనే చర్యలు తీసుకోవాలని తెలియజేస్తున్నామన్నారు,ఏ భూమిలేని పేదలకు పంచేవరకు ఈ పోరాటం ఆగదని దళిత సంఘాలు హెచ్చరిస్తున్నామన్నారు,ఈ కార్యక్రమంలో మాల మహానాడు స్టేట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజేపల్లి జయరాజ్, అంబేద్కర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు పోలం రెడ్డి మల్లికార్జున,అంబేద్కర్ సేవాసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల గాజుల శీను, ఉపాధ్యక్షులు కాకి చంద్రమౌళి బహుజన సంఘ రాష్ట్ర కార్యదర్శి కూని లక్ష్మీనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

# కూతురు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు.

**ఓబులవారిపల్లి మార్చి 4 రిపబ్లిక్ న్యూస్.**



తన కూతురు పూజ వయసు 10 సంవత్సరాలు 1వ తేదీ ఆదివారం మధ్యాహ్నం నుండి కనిపించడం లేదని ఆమె తండ్రి పెంచలయ్య ఓబులవారిపల్లె పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయడం జరిగినది, వివరాల్లోకి వెళితే ఓబులవారిపల్లె మండలం పెద్దఓరంపాడు గ్రామ రెవెన్యూ పొలాల్లో పని చేసుకుంటూ పిల్లలతో కలిసి అక్కడే జీవనం సాగిస్తున్నాడు, ఆదివారం 1వ తేదీన పెంచలయ్య కూతురు పూజ కొడుకు, కొడుకు వెంకటేష్ 5 సంవత్సరాల వయసు ఇద్దరూ ఆడుకుంటూ గొడవ పడుకోవడంతో గమనించిన తండ్రి వారు ఇద్దరిని మందలించడంతో కూతురు ఆరోజు ఆడుకుంటున్న మామిడి తోటల నుంచి కనిపించడం లేదని ఓబులవారిపల్లి పోలీసులకు తెలియజేయడం జరిగినది, వీరు ఎస్టి యానాది కులమునకు చెందినవారు,
బాలిక గల్లంతైన విషయమై కేసు నమోదు చేసి విచారణ చేపట్టడమైనది. ఈ విషయమై రైల్వే కోడూరు సిఐ, ఓబులవారిపల్లి ఎస్సై మరియు సిబ్బంది బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టడమైనది. బాలిక ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ నందు సమాచారం ఇవ్వగలరని కోరడమైనది.

# జనగణన కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలి

### డిఆర్ఓ మలోల

**అనంతపురం జేఎన్టీయూ, మార్చి 04,( రిపబ్లిక్ న్యూస్):**
గత ఒకటిన్నర దశాబ్దం తర్వాత చేపడుతున్న జన గణన కార్యక్రమంలో జిల్లాలో బాధ్యతగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా సెన్సెస్ అధికారి మలోలా సూచించారు. బుధవారం స్థానిక జేఎన్టీయూ కళాశాలలో నిన్నటి నుండి జన గణన పై శిక్షణ కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 6 వరకు యూనివర్సిటీలోని సెంట్రల్ కంప్యూటర్ సెంటర్ బ్లాక్ లో అధికారులు, ముఖ్య సిబ్బందికి శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో డేటా సేకరణ కు సంబంధించి హైదరాబాద్, విజయవాడ నుండి సెన్సెస్ శిక్షణ బృందం సభ్యులు జాయింట్ డైరెక్టర్ జగన్నాథ్ మజ్ హి, చట్టి శ్రీనివాసులు, దివాకర్ బరిహ, మాస్టర్ ట్రైనర్ మోహన్ రమణ, దీపక్ భరద్వాజ్ దామోదర్ అమిత్ సింగ్ విష్ణు మాధవి బృందం ఆధ్వర్యంలో సులభతరంగా అర్థమయ్యే విధంగా జన గణన ప్రక్రియను పూర్తిస్థాయిలో చేపట్టాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సేకరించిన వివరాలను కంప్యూటర్ మెయింటనెన్స్ మేనేజ్మెంట్ సిస్టం (సీఎంఎంఎస్) ద్వారా 33 అంశాల పై నమోదు గురించి శిక్షణ కల్పించారు. అంతకుముందు డిఆర్ఓ, జిల్లా సెన్సెస్ అధికారి మలోలా మాట్లాడుతూ ప్రస్తుతం ఈ జన గణన కార్యక్రమం గతం కంటే భిన్నంగా పూర్తిగా డిజిటల్ విధానంలోనే నిర్వహించాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ ప్రధాన సెన్సెస్ అధికారిగా ,జాయింట్ కలెక్టర్ అదనపు సెన్సెస్ అధికారిగా, డిఆర్ఓ జిల్లా సెన్సెస్ అధికారిగా కార్పొరేషన్ లో కమిషనర్ ప్రధాన సెన్సెస్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. మండల స్థాయిలో సూపర్వైజర్లు,ఎన్యుమరేటర్లు ఉంటారని



తెలిపారు. మొదటి దశలో గ్రామ మ్యాపింగ్, ఇళ్ల జాబితా సేకరణ, ఆ తర్వాత జనాభా లెక్కింపు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ మూడు రోజులు జరుగుతున్న శిక్షణా తరగతులలో ఎలాంటి సందేహాలుఉన్నాకూడావాటిని నివృత్తి చేసుకోవాలన్నారు. ఈసారి జనాభా లెక్కలు పూర్తిగా మొబైల్ యాప్ ద్వారా సేకరించబడే అవకాశం ఉందని పౌరులు కూడా తమ వివరాలు భయంగా నమోదు చేసుకునే సౌకర్యం ఉన్నట్లుపేర్కొన్నారు. జనగణన ప్రక్రియను పారదర్శకంగాలోపరహితంగా పూర్తి చేసి రాష్ట్రంలోనే జిల్లాకుమంచి పేరు తీసుకురావాలని డిఆర్ఓ మలోలా కోరారు. అనంతరం డిజిటల్ విధానం ద్వారా నమోదు అవుతున్న వివరాల ప్రక్రియను పరిశీలించారు.
ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డిఓ కేశవ నాయుడు, కళ్యాణ్ దుర్గం ఆర్డీవో వసంత బాబు, గుంతకల్ ఆర్డీవో శ్రీనివాస్, సిపిఓ అశోక్, డీఈవో ప్రసాద్ బాబు, డిపిఓ నాగరాజ నాయుడు, జడ్పీ సీఈవో శివశంకర్, మున్సిపల్ కమిషనర్లు, తాసిల్దారులు, ఎంపీడీవోలు , తాసిల్దారులు హరికుమార్ ,రాజా, సూపర్డెంట్ కోఆర్డినేషన్ యోగేశ్వరి దేవి, లు, డిప్యూటీ తాసిల్దారులు కనకరాజు మధుసూదనరావు, ఎస్వ గిరిధర్ ,ఏ ఎస్ ఓ లు ,టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఇలాకాలో .. మరణమృదంగం

**శిశువుల మృతులే ఇందుకు కారణం**

**కలెక్టర్ బాధ్యులైన వైద్యులను విధుల నుంచి తొలగించాలి**

**సిపిఐ (యమ్ యల్) లిబరేషన్ పార్టీ,**

**ఐఎఫ్టియు హెచ్చరిక**

**శిశువు మృతి పై సూపర్డెంట్ కు వినతి పత్రం అందజేత**

**అనంతపురం క్రైమ్, మార్చి 04,(రిపబ్లిక్ న్యూస్):**
మంత్రి ఇలాకాలో శిశువుల "మరణ మృదంగం" వల్ల కన్న తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చాని మండిపడ్డారు. ఇటీవల జరిగిన శిశువు మరణాలే దీనికి కారణమని సిపిఐ (యమ్ యల్) లిబరేషన్ పార్టీ, ఐఎఫ్టియు సూచించారు.
అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ఇటీవల కాలంలో శిశు మరణాలు వైద్యుల నిర్లక్ష్యం వల్ల జరుగుతూనే ఉన్నాయన్నారు. మంగళవారం అర్ధరాత్రి జరిగిన శిశు మరణం ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం అన్నారు. శిశువు మరణించడం అత్యంత బాధాకరమన్నారు.



మృతి పట్ల వారు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైద్యులు సరైన సమయంలో వైద్యం అందించి ఉంటే శిశువు బ్రతికే వాడని తెలియజేశారు. ఈ సందర్భంగా బుధవారం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి గారికి సిపిఐ (యమ్ యల్) లిబరేషన్ పార్టీ, ఐఎఫ్టియు ఆధ్వర్యంలో నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆమెకు వినతి పత్రం అందజేశారు.

**గర్భవతుల విభాగంలో వైద్యుల కొరత**
ఈ సందర్భంగా సిపిఐ (యమ్ యల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వేమన, ఐఎఫ్టియు నగర అధ్యక్షుడు దావీదు మాట్లాడుతూ గత కొంతకాలంగా ఆసుపత్రిలో తగిన సదుపాయాలు లేకపోవడం, వైద్యుల, సిబ్బంది కొరత అత్యవసర సేవల్లో ఆలస్యం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. ప్రత్యేక గర్భవతుల విభాగంలో సరైన పరికరాలు, వైద్యుల కొరత ఉండడంవల్ల ఆసుపత్రి మరింత దారుణంగా మారుతోందన్నారు. పైగా ప్రైవేట్ క్లినిక్‌లకు రిఫర్ చేయడం వల్ల పేద ప్రజలపై ఆర్థిక భారం పడుతోందన్నారు. ఇదే ఉమ్మడి జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నా కూడా ఇలాంటి దారుణ సంఘటనలు జరగడం అత్యంత బాధాకరనన్నారు.
ప్రజా ప్రతినిధులు ఆరోగ్య సంరక్షణపై హామీలు ఇస్తూ, సదుపాయాలు కల్పించకపోవడం ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు.

**జిల్లా కలెక్టర్ స్పందించకుంటే ఆందోళనలు చేపడతాం**
వైద్య శాఖ మంత్రి ఇలాకాలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం అత్యంత విచారకరమన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి శిశువు మృతికి కారణమైన వైద్యులను విధుల నుంచి తొలగించాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్నటువంటి సంఘటనలపై స్పందించకుంటే ప్రజాసంఘాలు, ప్రజలు కలిసి ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీమేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాదిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

### హౌసింగ్ పీడీ శైలజ ఆదేశం

**అనంతపురం హౌసింగ్, మార్చి 04,( రిపబ్లిక్ న్యూస్ ):**
ఉగాదిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అనంతపురం జిల్లా హౌసింగ్ పీడీ మడిచేడు శైలజ ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆమె తన ఛాంబర్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డివిజన్ల వారీగా ఇళ్లు మంజూరు, కేటాయించిన టార్గెట్ గురించి ఆరా తీశారు. ఇప్పటి వరకు ఎన్ని పూర్తయ్యాయి, ఇంకా ప్రోగ్రెస్ లో ఎన్ని ఇళ్ళు ఉన్నాయనే వివరాలు ఆరా తీశారు. ఇప్పటి వరకు జిల్లాలో కళ్యాణదుర్గం టాప్ లో ఉండగా, అనంతపురం చివరి జాబితాలో ఉన్నట్లు తెలిపారు. గుంతకల్లు డివిజన్ రెండో స్థానంలో ఉందని వివరించారు. పురోగతిలో వెనుకబడిన డివిజన్లు, మండలాల అధికారులు తమకు కేటాయించిన టార్గెట్లపై దృష్టి పెట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.



# ఈ యుద్ధంతో ఆర్థిక సంక్షోభం తప్పదా ?

**అమరావతిమార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**
వరుస యుద్ధాలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్తను అతలాకుతలం చేస్తున్నాయి. భారత్ లాంటి పేదదేశం మరింత కుంగిపోయేలా చేస్తోంది. కరోనాతో మొదలైన దాడి ఇప్పుడు గల్ఫ్ యుద్ధంతో తారాస్థాయికి చేరుకుంది. ఇరాన్పై ఇజ్రాయిల్, అమెరికాల దాడితో చమురుత సంక్షోభంతో దారుణ పరిస్థితి మొదలు కానుంది. ఇది తరవాత క్రమంగా నిత్యాసవరాలు, కూరగాయలు, మందులపై పడనుంది. అన్నింటికీ మూలం చమురు కనుక ఈ యుద్ధంతో చమురు సంక్షోభం తప్పేలా లేదు. ఇరాన్పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి భారత ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేయనుంది. ఈ యుద్ధంతో చమురు ధరలు కొండెక్కి.. వాణిజ్య లోటు, ద్రవ్యోల్బణం భారీగా పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన కలుగుతోంది. భారత ఆర్థిక వ్యవస్థపై ఈ యుద్ధ ప్రభావం తోణమే ప్రారంభమవుతుందని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఈ సెగ సామాన్యులకు కూడా త్వరగానే తగలబోతోంది. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయాయి. హోర్ముజ్ జలసంధిని మూసివేయడం

ద్వారా సరుకు రవాణా ఆగిపోవడం ఖాయం అయ్యింది. ఏతావాతా అది మన జేబులు చల్లుపెట్టడం, ధరలపై ప్రభావం చూపడం తద్వారా మన వంటింటికి కూడా తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుందనడంలో సందేహం లేదు. మనకు అవసరమైన సోయా, సన్ ప్లవర్ వంటి వంట నూనెలు, పప్పు దినుసులను ఇతర దేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనా, బ్రెజిల్, అమెరికా నుంచి సోయా ఆయిల్, ఉక్రెయిన్, రష్యాల నుంచి సన్ ప్లవర్ ఆయిల్ దిగుమతవుతున్నాయి .వంట నూనెలను తీసుకొచ్చే నౌకలు సూయజ్ కెనాల్, హోర్ముజ్ జలసంధి మీదగా రావాలి. ఇరాన్ ఇప్పటికే హోర్ముజ్ జలసంధిని మూసి వేసింది. దీంతో వీటిని తీసుకొచ్చే నౌకలు మరింత దూరం ప్రయాణించి మన రేవులకు చేరాలి. దీంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగి ధరల పెరుగుదల మీద తీవ్ర ప్రభావం పడనుంది. అలాగే ముడిచమురు దిగుమతుల ప్రభావం వల్ల వంట గ్యాస్ ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. మనదేశం ప్రతి ఏటా 5-6 మిలియన్ టన్నుల మేర కందిపప్పు, పెసరపప్పు వంటి పప్పు ధాన్యాలను మయన్మార్, కెనడా, ఆఫ్రికా నుంచి దిగుమతి చేసుకుంటోంది. నిజానికి మనదేశంలో పప్పు దినుసులు విపరీతంగా పండుతున్నా ఎందుకనో దిగుమతులు చేస్తున్నాం. వీటిని దేశీయంగా పండిస్తున్నా ధరలు రావడం లేదు. రైతులను ప్రోత్సహించడం లేదు. కందులు, సోయా అమ్ముకోలేక ఏటా రైతులు నానా యాతన పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ సందర్భంగా అయినా దేశీయ పంటలను ప్రోత్సహిస్తే మంచిది. పప్పులు, నూనె ధాన్యాలకు మన నేలలు అనుకూలం. ఇకపోతే ఇరాన్ ఆంక్షలతో హోర్ముజ్ జలసంధి స్థంభించిన కారణంగా వీటిని తీసుకొచ్చే నౌకలు కూడా మరో మార్గంలో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఫలితంగా రవాణా ఖర్చులు, బీమా ఖర్చులు భారీగా పెరిగి వాటి ప్రభావం రిటైల్ కొనుగోలుదారులపై పడుతుంది. అలాగే మనం వాడే జీడిపప్పు, పిస్తా, ఎండు ద్రాక్ష, ఆప్రికాట్ వంటి డ్రైఫ్రూట్స్, నట్స్ ధరలు కూడా భారీగా పెరిగే ప్రమాదముంది. వీటిని ఎక్కువగా ఇరాన్, అఫ్గానిస్థాన్ నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇరాన్ యుద్ధంలో తలమునకలై ఉంది. మరోవైపు అఫ్గనిస్థాన్ కూడా పాకిస్థాన్తో తలపడుతోంది. ఈ



నేపథ్యంలో వీటి దిగుమతులు కూడా ప్రభావితమవుతాయి. హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలు తొలగితే కొంత ఊపిరిపీల్చుకోగలుగుతారు. నిజానికి దేశంలో పంటలు పండుతున్నా దిగుమతులు విపరీతంగా చేసుకుం టున్నాం. దిగుమతులపై ఆంక్షలు విధిస్తే దేశీయంగా మన ఉప్పులు, పప్పులు కొనుగోలు చేసుకోవచ్చు. రైతులను ఈ దిశగా ప్రోత్సహించే చర్యలు కరువయ్యాయి. దిగుమతుల దాడుల కారణంగానే ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలతో పాటు భారత్నూ పేదరికం పట్టి పీడిస్తోంది. 147కోట్ల దేశ జనాభాలో నేటికీ 28 శాతం మంది పేదరికంలోనే మగ్గుతున్నారని ఇటీవలి అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత్ పేద దేశం కాదని, భారతీయులే పేదవారనే అభిప్రాయం ఉంది. పాలకుల దృష్టి లోప కారణంగా మనదేశంలో పేదలు ఎదగడం లేదు. నిత్యావసరాలు వారికి అందడం లేదు. ఔషధాల ధరలు విపరీతంగా పెరిగాయి. విద్య, వైద్యం అందకుండా పోతోంది. వీటి గురించి పాలకులు ఆలోచన చేయడం లేదు. ఇప్పుడు యుద్ధం పుణ్యమా అని అన్న రకాల వస్తువుల ధరలు పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. డబ్బున్న పాలకులు ఉండడం వల్ల వారికి పేదరికం అర్థం కావడం లేదు. పేదరికం సామాజిక రుగ్మతగా గుర్తించడం లేదు. ఆకలి, జీవన ఒత్తిళ్లు ఒక కుటుంబాన్ని ఎలా నిస్తేజంగా మార్చుతాయో, నిశ్శబ్దంగా వారి ప్రాణాలనే ఎలా మింగేస్తున్నాయో ఆయా సందర్భాల్లో జరుగుతున్న అనేకానేక ఆత్మహత్యలు ధృవీకరిస్తున్నాయి. బ్రిటిష్ పాలన నాటికంటే ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగాయని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. దేశ సంపదలో సగానికి పైగా సంపద కేవలం 10శాతం మంది కుబేరుల దగ్గర పోగయ్యింది. మోడీ పాలనలో రూపాయి విలువ చరిత్రలో కనివిని ఎరుగనంత పతనావస్థకు దిగజారింది. పేదలు మరింత పేదలుగా కావడానికి, మధ్య తరగతి వర్గం పేదరికంలోకి జారిపోవడానికి ప్రధానకారణం వ్యవసాయ క్షీణత, నిరుద్యోగం, విద్య, వైద్యం అత్యంత ఖరీదైనవిగా మారడం అని నిపుణులు చెబుతున్నారు. ఈ దశలో మనం సంస్కరణలకు దిగాలి. ఆహారా ధాన్యాల దిగుమతులను తగ్గించుకోవాలి. దేశీయంగా ప్రోత్సాహకాలు ఇవ్వాలి. దేశీయ వస్తువులను వాడాలనడం కాదు..దేశీయ ఆహారాలనే వాడలనే నినాదం రావాలి. ఈ యుద్దంతో అయినా పాలకుల ఆలోచనా తీరు మారాలి. లేకుంటే సంక్షోభంలో కూరుకుపోవడం ఖాయం.

అభివృద్ధి చెందుతున్న భారత్ వంటి దేశాల్లో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, సామాజిక సమస్యలు పేదరికానికి కారణమౌతున్నాయి. ఇవి ఒకదానితో ఒకటి ముడిపడి వుంటాయి. గత కొన్ని దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనకు అనేక ప్రణాళికలు రూపొందిస్తున్నా వాటి ఫలాలు, ఫలితాలు పేదలకు చేరడంలేదు. కారణం అవి సరిగా లేకపోవడం లేదా, అమలులో లోపాలు ఉండడమే కారణంగా చూడాలి. ప్రపంచ యుద్దాలతో మనం మారాలి. స్వయం సమృద్ధి దిశగా నడవాలి. సంక్షోభాలను ఎదుర్కొనేలా నిలబడగాలి. అప్పుడే దేశం ఆర్థికంగా నిలబడుతుంది.

# మోడీ పర్యటనలకు దాడులకు లింకేంటి

## యుద్ధం అన్నది మా ప్రణాళికలో భాగం -విమర్శలకు దీటుగా స్పందించిన ఇజ్రాయిల్

**న్యూఢిల్లీమార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**
ఇరాన్ – ఇజ్రాయెల్ దేశాల మధ్య గత ఐదు రోజుల నుంచి యుద్ధం నడుస్తోంది. ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్, అమెరికా దళాలు సంయుక్తంగా ఇరాన్పై బాంబు దాడులు చేశాయి. ఇరాన్ నాయకులే లక్ష్యంగా టెహ్రాన్లోని 30 చోట్ల బాంబు దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ, ఆయన భార్య, కూతురు, అల్లుడు, మనవడు ప్రాణాలు కోల్పోయారు. శనివారం జరిగిన దాడుల్లో ఖమేనీ చనిపోగా.. మరుసటి రోజు ఈ విషయాన్ని ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఇజ్రాయెల్, అమెరికాలపై ప్రతి దాడులకు దిగింది. ఖమేనీ మృతి చెందినా ప్రధాని మోడీ స్పందించడం లేదని, ఖండించడం లేదని విపక్ష పార్టీలు నిలదీస్తున్నాయి. మోడీ తీరువల్ల భారత్ పరువు పోయిందని గగ్గోలు పెడుతున్నాయి. ఇరాన్పై ఇజ్రాయెల్ దాడి చేయడానికి రెండు రోజుల ముందు



భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్లో పర్యటించారు. ఫిబ్రవరి 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు మోదీ పర్యటన సాగింది. మోదీ పర్యటన ముగిసిన సరిగ్గా రెండు రోజులకు.. ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్.. ఇరాన్పై దాడి చేసింది. ఈ విషయం ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో పలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న చర్చ, సోషల్ మీడియా ప్రచారాలపై స్పందించారు. రూవెన్ అజర్ మాట్లాడుతూ.. 'అదొక ఆపరేషనల్ అవకాశం మాత్రమే. ప్రధాని మోదీ వెళ్లిపోయిన తర్వాత ఆ అవకాశం వచ్చింది. మోదీ పర్యటన సందర్భంగా ఆయనతో దేశాభివృద్ధి గురించి మాత్రమే మాట్లాడాము. ఈ విషయం గురించి ఆయనతో చర్చించలేదు. దాడులు చేస్తామని ఆ సమయానికి మాకు కూడా తెలీదు. మోదీ వెళ్లిపోయిన తర్వాత ఇరాన్పై దాడి చేయాలా? వద్దా? అన్నదానిపై నిర్ణయం తీసుకోవడానికి రెండు రోజుల సమయం పట్టింది. ఇరాన్పై దాడులకు ఫిబ్రవరి 28వ తేదీ ఉదయం సెక్యూరిటీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆ తర్వాతే దాడులు జరిపాము. దాడులకు చాలా కాలం ముందునుంచే మేము అమెరికాతో సంప్రదింపులు జరుపుతూ ఉన్నాము. సరైన సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నామని చెప్పుకొచ్చారు.

# అవయవ దానం

## : కొత్త జీవితాలు ఇస్తూ ఏపీ రికార్డు

**అమరావతిమార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**
అవయవ దానం అన్నది ఒక గొప్ప మానవతా సేవా భావం. గతంతో పోలిస్తే అవయవ దానం మీద జనాలలో చైతన్యం పెరిగింది. చాలా మంది అవయవ దానానికి ముందుకు వస్తున్నారు. మరణం తరువాత కూడా తమ అవయవాలు ఎందరికో ఉపయోగపడాలని ఆ విధంగా మరోసారి జన్మ ఎత్తి తాము ధన్యత పొందాలని అనేక మంది ఆలోచిస్తున్నారు. దాంతో దేశంలో అవయవ దానంలో ఏపీ ముందు వరసలోకి వచ్చింది. రాష్ట్రానికి ఆరవ స్థానం : ఇదిలా ఉంటే అవయవ దానంలో భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆరో స్థానంలో నిలిచిందని కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అపెక్స్ బాడీ అయిన నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్ ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ రాష్ట్రాల వారీగా అవయవ దాన జాబితా-2025ను తాజాగా ప్రకటించింది. దీని ప్రకారం చూస్తే కనుక ఏపీకి మంచి ప్లేస్ లభించింది. రాష్ట్ర విభజన తరువాత 2015లో ఏర్పాటు అయిన జీవన్ దాన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలలో చైతన్యం తెస్తోంది అని అధికారులు చెబుతున్నారు.

**అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు :**
మరో వైపు చూస్తే ఇటీవల హైకోర్టు ప్రభుత్వాసుపత్రులలో అవయవాల మార్పిడి శస్త్ర




చికిత్సల గురించి ఆదేశాలు వెలువరించిన నేపథ్యంలో ఏపీలో అవయవాల మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగే ఆసుపత్రుల సంఖ్య మూడు నుంచి తొమ్మిదికి పెరిగింది. ఈ క్రమంలో విశాఖలోని కేజీహెచ్, విమ్స్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా ఇప్పటి వరకు బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తులు నుంచి ఎనిమిది కిడ్నీలు, ఒక లివర్ మార్పిడి చేయగా రక్త సంబంధీకుల నుంచి 87 కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేసినట్లు అధికారులు అంటున్నారు. తాజాగా విజయవాడ శివారులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి గుండెను స్వీకరించి గుండె మార్పిడి విజయవంతంగా పూర్తి చేశారు

**మానవత్వం వెల్లి విరుస్తోంది :**
మరో వైపు చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాదిలో కేవలం రెండు నెలల కాలంలోనే 18 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 64 అవయవాలు స్వీకరించి 64 మంది జీవితాల్లో వెలుగులు నింపారు. ఇది గడిచిన రెండు సంవత్సరాలతో పోల్చుకుంటే గణనీయంగా అవయవ దాన కేసులు పెరుగుతున్నాయి అనటానికి నిదర్శనంగా ఉంది. గత ఏడాది మొదటి రెండు నెలల్లో 12 మంది బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి 31 అవయవ దాన మార్పిడి జరిగితే, 2024లో 10 మంది బ్రెయిన్ డెడ్ వ్యక్తులు నుంచి సహకరించిన 30 అవయవాల మార్పిడి జరిగాయి. ఈ ఏడాది మరింతగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలు స్వీకరించి అవయవాలు కోసం ఎదురుచూస్తున్న బాధితులకు భరోసా కల్పించేందుకు జీవన్ దాన్ రంగం సిద్ధం చేస్తోంది.

**వారందరికీ నూతన జీవితాలు :**
రాష్ట్రంలో అవయవాలు ఆయుష్షు నిండి ఎదురుచూస్తున్న 1200 మంది బాధితులకు రాష్ట్ర జీవన్ దాన్ నూతన జీవితాలను ప్రసాదించింది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలను స్వీకరించి బాధితులకు అండగా నిలుస్తూ వారి జీవితాలకు కొత్త వెలుగులు నింపింది. అలాగే గత ఏడాది కాలంలోనే 301 మంది బాధితులకు నూతన జీవితాలను ప్రసాదించి సరికొత్త చరిత్రను రాష్ట్ర జీవన్ దాన్ సృష్టించింది.

# మాదిగలకు రాజ్యసభ సీటు ఇవ్వండి

## రాహుల్కు మందకృష్ణమాదిగ లేఖ



**వరంగల్,మార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**
రాజ్యసభ ఎన్నికల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏఐసీసీ అగ్రనేత, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్గాంధీకి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో భర్తీకాబోతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానం మాదిగలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎస్సీ స్థానాలైన పెద్దపల్లి, వరంగల్, నాగర్ కర్నూల్ స్థానాల్లో కూడా మాదిగలకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి పార్లమెంట్లో మాదిగలకు ప్రాతినిధ్యం లేదని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రాజ్యసభ స్థానాల్లో ఓ స్థానమైనా మాదిగలకు అవకాశం కల్పించాలని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

---------------

# హిందూ పండగలంటే చిన్న చూపెందుకు

## సిఎం రేవంత్ను ప్రశ్నించిన రాజాసింగ్

**హైదరాబాద్,మార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**:హిందు పండుగలు, ముస్లింల పండుగల మధ్య తెలంగాణ ప్రభుత్వం తేడాలు ఎందుకు చూపిస్తోందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. అలాగే హిందూ పండగలపై చిన్నచూపెందుకని అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చినట్లుగానే హిందువుల కోసం ప్రత్యేక వేడుకలు చేసేలా కాంగ్రెస్ సర్కార్ ప్రకటన చేసేలా చూడాలని కోరారు. రంజాన్ కోసం ఇఫ్తార్ మాదిరిగా హిందువుల కోసం నవరాత్రి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లింల ఓట్ల కోసం ఇఫ్తార్ వేడుకలను చేసే నేతలకు హిందువుల ఓట్లు అవసరం లేదా అని ప్రశ్నించారు. ముస్లింల ఓట్ల గురించి టోపీ పెట్టుకొనే రాజకీయ పార్టీలకు హిందువులు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే రాజాసింగ్ సూచించారు.

------

# ఆస్తులను కూడా వదిలేట్టుగా లేరు

## తన పాలం సర్వేకు నోటీసులపై మండిపడ్డ అంబటి



**గుంటూరు,మార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**
కూటమి ప్రభుత్వం తనపై, తన కుటుంబంపై చేసిన పాశవికమైన దాడి అందరూ చూశారని మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత అంబటి రాంబాబు పేర్కొన్నారు. తనపై దాడి చేసిన వారు మినహా.. రాష్ట్ర ప్రజలు దీనిని దారుణమైన సంఘటనగా పరిగణించారని చెప్పుకొచ్చారు. తన ఆస్తులపై కూడా దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తనకు సత్తెనపల్లిలో 22 ఎకరాల పొలం ఉందని.. ఆ పొలానికి కూడా సర్వే పేరుతో నోటీసులు ఇచ్చారని ప్రస్తావించారు. బుధవారం గుంటూరులో మీడియాతో అంబటి రాంబాబు మాట్లాడారు. తన పొలాన్ని సర్వే చేయాలని ఎమ్మార్వో కార్యాలయం నుంచి తనకు నోటీసులు ఇచ్చారని చెప్పుకొచ్చారు. రీజినల్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ తనిఖీ చేయమని చెప్పారని వారు తనకు చెప్పారన్నారు. తన పొలంలో స్విమ్మింగ్ పూల్, గెస్ట్ హౌస్ ఉందని.. సర్వే చేయాలని అధికారులు చెబుతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్లకు పని ఏమి లేదా అని ప్రశ్నించారు. వారు తన ఆస్తుల మీద పడ్డారని... తాను లీగల్గా కొనుకున్న స్థలం అదని చెప్పుకొచ్చారు. తాను వేరే వారి నుంచి పొలం కొనుక్కునే ముందే అందులో చిన్న బావి, పెంకుటిల్లు ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి అధికారం శాశ్వతం కాదన్నారు. తన దగ్గర దాపరికాలు ఏమి ఉండవుని.. చంద్రబాబు, లోకేశ్ తన పొలం చూస్తాను అంటే రావాలని అన్నారు. తనను బయపెట్టాలని వారు అనుకుంటున్నారని.. రేపు గుంటూరులో తమ ఇంటికి కూడా నోటీసులు ఇస్తారేమోనని అంబటి రాంబాబు పేర్కొన్నారు.

# బ్యాక్ టూ బ్యాక్ ఛాన్సులతో శ్రీలీల!

తెలుగు హీరోయిన్ శ్రీలీల తెలివైన నిర్ణయాలతో ముందుకెళ్తోంది. టాలీవుడ్ సినిమాల్లో ఐటం పాటల్లో కొనసాగితే కెరీర్ ఎలా ఉంటుంది? అన్నది అమ్మడు ముందే గుర్తించి అలెర్ట్ అయింది. దీంతో హీరోయిన్ గా వచ్చిన అవకా శాలు సైతం వదులుకోవడానికి ఎంత మాత్రం వెనకడుగు వేయలేదు. హీరోయిన్ ఛాన్స్ ఎరతో? ఐటం పాటలోనూ లాక్ చేసే ప్రయత్నాలు కొందరు చేసే సరికి వారి అతి తెలివిని పసిగట్టి మొత్తం ప్రాజెక్ట్ నే వదులుకుంది. ఈ విష యంలో అమ్మడు ఎంతో తెలివిగా ఎస్కేప్ అయింది. అప్పటి నుంచి తెలుగు అవకాశాల పట్ల తస్మాత్ జాగ్రత్తగా ఉంటుంది కొత్త అవకాశాలతో ఎవరు వచ్చినా? ఆచి తూచి మాట్లాడుతుంది. నిర్ణయాలు తీసుకునే ముందు మామ్ సలహా కూడా తీసుకుని ముందుకెళ్తుంది. ప్రస్తుతం శ్రీలీల తెలుగు సినిమాల కంటే హిందీ, తమిళ సినిమాలపై దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే బాలీవుడ్ లో సంచలన మ్యూజికల్ లవ్ స్టోరీ ఆషీకీ 3 లో నటిస్తోంది. ఇందులో అమ్మడు కార్తీక్ ఆర్యన్ కు జోడీగా నటిస్తోంది. ఈ సినిమాలో ఇంటిమేట్ సన్నివేశాలున్నా? అమ్మడు ఎంత మాత్రం రాజీ పడలేదు. స్క్రిప్ట్ డిమాండ్ చేస్తే తాను పూర్తిగా దర్శకుల హీరోయిన్ అని ప్రూవ్ చేయబోతుంది. ఈ సినిమా విజయం సాధిస్తే గనుక శ్రీలీల బాలీవుడ్ కెరీర్ మారిపోతుంది. ఒక్క విజయంతోనే అమ్మడు తారా స్థాయికి చేరిపోతుంది. శ్రద్దాకపూర్ బాలీవుడ్ ఈ సినిమా సీక్వెల్ తోనే సంచలన నటిగా మారింది. మరి శ్రీలీల అంతటి అదృష్టవంతురాలు అవుతుందా? లేదా? అన్నది చూడాలి. మరో ఇంట్రెస్టింగ్ విషయం ఏంటంటే కార్తీక్ఆర్యన్– శ్రీలీల మంచి డాన్సర్లు. మ్యూజికల్ లవ్ స్టోరీ కావడంతో వాళ్లలో డాన్సింగ్ స్కిల్స్ ను కూడా దర్శకుడు అనురాగ్ బసు సద్వినియోగం చేసుకోగల్గితే సినిమాకు అదనంగా కలిసొస్తుంది. ఈ సినిమా సెట్స్ లో ఉండగానే ఇదే కాంబినేషన్ తో మరో డైరెక్టర్ ఓ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నట్లు బాలీవుడ్ మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ సినిమాకు –ఫీటమ్ పురా– అనే టైటిల్ కూడా పెట్టినట్లు ప్రచారంలో ఉంది. ఇదొక భారీ యాక్షన్ థ్రిల్లర్ అని వినిపిస్తోంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇదే నిజమైతే శ్రీలీల నెట్టింట సంచలనం అవుతుంది. ఒక సినిమా సెట్స్ లో ఉండగానే మరో సినిమా లో ఛాన్స్ అంటే? ఆ వైబ్ వేరే లెవల్లో ఉంటుంది. తాజాతా కోలీవుడ్ స్టార్ ధనుష్ 55వ చిత్రంలోనూ శ్రీలీల హీరోయిన్ గా ఎంపికైంది. కెరీర్ ఆరంభంలోనే ధనుష్ తో నటించే ఛాన్స్ రావడం అంటే? ఎంతో లక్కీ గాళ్ అనే చెప్పాలి. దనుష్ కోసం ఎంతో మంది భామలు క్యూలో ఉంటే వాళ్లందర్నీ పక్కకు నెట్టి మరీ తెలుగు నటి ఛాన్స్ అందుకుంది. త్వరలో –ఉస్తాద్ భగత్ సింగ్– తో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇందులో పవన్ కళ్యాణ్ కు జోడీగా నటించింది. ఈ సినిమా హిట్ అయితే గనుక శ్రీలీల పేరు టాలీవుడ్ లో మరోసారి మారుమ్రోగిపోతుంది.



# గొప్ప మనసు చాటుకున్న అల్లు అర్జున్..

## పావలా శ్యామలకు ప్రతి నెలా ఆర్థిక సాయం



సీనియర్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల ఎదుర్కొంటున్న కష్టాలపై అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ స్పందించారు. తీవ్ర అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆమెకు శాశ్వత భరోసా కల్పిస్తూ తన ఉదారతను చాటుకున్నారు. పావలా శ్యామల, ఆమె కుమార్తె వైద్య ఖర్చులు, నిత్యవసరాల కోసం ప్రతి నెలా రూ. 10,000 అందేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వందలాది చిత్రాల్లో తన నటనతో ప్రేక్షకులను అలరించిన పావలా శ్యామల, గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. సరైన ఆదరణ లేక, ఆర్థికంగా చితికిపోయి తన కుమార్తెతో కలిసి సికింద్రాబాద్ కార్ఖానాలోని ఆర్కే ఫౌండేషన్‌లో ఆశ్రయం పొందుతున్నారు. తల్లీకూతుళ్లిద్దరి ఆరోగ్యం క్షీణించి, కనీసం మందులు కొనుక్కోలేని దీనస్థితిలో ఉన్నారని తెలుసుకున్న అల్లు అర్జున్ వెంటనే చలించిపోయారు. వారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు.


గతంలో చిరంజీవి వంటి పలువురు సినీ ప్రముఖులు ఆమెకు ఆర్థికంగా అండగా నిలిచారు. అయితే, అల్లు అర్జున్ ఒక అడుగు ముందుకేసి, తాత్కాలిక సాయం కాకుండా ప్రతి నెలా క్రమం తప్పకుండా డబ్బు అందేలా బాధ్యత తీసుకోవడం విశేషం. కష్టాల్లో ఉన్న తోటి కళాకారులను ఆదుకోవడంలో బన్నీ చూపిస్తున్న ఈ చొరవ పట్ల సినీ పరిశ్రమ వర్గాలు, అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# కమల్, రజనీల మూవీపై సర్వత్రా ఆసక్తి

## వచ్చే యేడు షూటింగ్ మొదలవుతుందని టాక్



46 ఏళ్ల లాంగ్ గ్యాప్ తర్వాత లెజెండరీ యాక్టర్లు కమల్ హాసన్, రజనీకాంత్ కాంబోలో సినిమా వస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి 'జైలర్'ఫేం నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ప్రతీ రోజు ఏదో ఒక అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై హైప్ పెంచేస్తోంది. తాజా న్యూస్ ఒకటి మూవీ లవర్స్‌తోపాటు అభిమానుల్లో క్యూరియాసిటీ రేకెత్తిస్తుంది. సినిమా షూటింగ్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా..? అని ఎదురు చూస్తున్నఅభిమానుల కోసం అదిరిపోయే వార్త షేర్ చేశాడు మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్. ఈ టాలెంటెడ్ కంపోజర్ ప్రకారం ఈ మూవీ షూట్ వచ్చే ఏడాది మొదలు కానుందని చెప్పాడు. ప్రస్తుతం రజినీకాంత్, కమల్ హాసన్ తమ కమిట్‌మెంట్స్ పూర్తి చేసుకున్న తర్వాత ఈ ప్రాజెక్ట్ షూటింగ్‌లో చేరనున్నారని ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ నిర్మిస్తోంది. కాగా ఈ సినిమాని 80స్, 90స్‌లో ఉపయోగించిన ఫిల్మ్ కెమెరాలతో షూట్ చేయనున్నారంటూ ఓ క్రేజీ అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతోంది. నెల్సన్, రాజీవ్ మీనన్ ఇప్పటికే ప్రోమోను ఇదే పద్ధతిలో షూట్ చేయాలనుకున్నా.. టైం తక్కువగా ఉండటం వల్ల డిజిటల్ మెథడ్‌లో ప్రోమోను తెరకెక్కించారని ఇన్‌సైడ్ టాక్. మల్టీస్టారర్ స్పెషల్ గ్లింప్స్ కూడా విడుదల చేయగా.. గ్లింప్స్‌లో కమల్–రజనీ ఇద్దరూ ఎవరు స్టైల్‌లో వారు కనిపిస్తూ.. కాస్ట్యూమ్స్, బూట్లు, బెల్ట్, వాచ్, కళ్లద్దాలతో ఒకరినొకరు డామినేట్ చేసుకునేలా కనిపిస్తూ సందడి చేస్తున్నారు.



# పెద్ది రైరై రారా పాటకు భారీగా లైక్స్

పాన్ ఇండియా స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. విలేజ్ బ్యాక్‌డ్రాప్, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్ కలయికతో రూపొందుతున్న ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా విడుదలైన సెకండ్ సింగిల్ 'రై రై రా రా' లిరికల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి రికార్డులు సృష్టిస్తోంది. ఈ పాటకు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చి స్వయంగా ఆలపించడం విశేషం. అనంత శ్రీరామ్ అందించిన సాహిత్యం మాస్, మోటివేషనల్ టచ్‌తో ఆకట్టుకుంటోంది. జానీ మాస్టర్ రూపొందించిన కొరియోగ్రఫీ ఈ సాంగ్‌కు హైలైట్‌గా నిలిచింది. ముఖ్యంగా రామ్ చరణ్ వేసిన గ్రేస్‌ఫుల్ స్టెప్పులు, ఫాస్ట్ మూమెంట్స్ అభిమానులను ఫిదా చేస్తున్నాయి. కొందరు అభిమానులు ఆయన డ్యాన్స్‌ను 'చిరుత' రోజుల్ని గుర్తు చేసేలా ఉందని సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. ఈ పాటపై మెగాస్టార్ చిరంజీవి కూడా ప్రశంసలు కురిపించారు. 'రై రై రా రా' సాంగ్ ఎనర్జీ, ఎమోషన్, సినీమాటిక్ బ్రిలియన్స్‌తో అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. రామ్ చరణ్ డ్యాన్స్ తనను ఎంతో గర్వపడేలా చేసిందని, స్క్రీన్‌పై ఆయన గ్రేస్ ప్రత్యేకంగా మెరిసిందని వ్యాఖ్యానించారు. దర్శకుడు బుచ్చిబాబు సానా, ఏఆర్ రెహమాన్ సంగీతం, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, లిరిసిస్ట్ అనంత శ్రీరామ్ అందరి కృషి వల్లే ఈ సాంగ్ మరోస్థాయికి వెళ్లిందని అభినందించారు. ఈ ప్రశంసలకు బుచ్చిబాబు సానా భావోద్వేగంగా స్పందిస్తూ, మెగాస్టార్ నుంచి వచ్చిన మాటలు జీవితాంతం గుర్తుండిపోతాయని తెలిపారు. రికార్డుల విషయానికి వస్తే, విడుదలైన 24 గంటల్లోనే 'రై రై రా రా' లిరికల్ వీడియో 46.1 మిలియన్ వ్యూస్ సాధించి టాలీవుడ్‌లో అత్యధిక వ్యూస్ అందుకున్న లిరికల్ సాంగ్‌గా నిలిచింది. మాస్ బీట్, ఎనర్జిటిక్ ట్యూన్, రామ్ చరణ్ డ్యాన్స్ అన్నీ కలిసి ఈ రికార్డు సాధించడంలో కీలక పాత్ర పోషించాయి.అయితే టాప్ లిరికల్ వ్యూస్ జాబితాలో రెండో స్థానంలో కూడా 'పెద్ది' చిత్రానికే చెందిన 'చికిరి చికిరి' పాట 29.19 మిలియన్ వ్యూస్‌తో నిలవడం విశేషం.

# మణిపురి బూంగ్‌కు బ్రిటిష్ అకాడమీ అవార్డు




మణిపురి భాషలో తెరకెక్కిన 'బూంగ్' చిత్రం ప్రతిష్టాత్మకమైన బ్రిటీష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్ 2026 అవార్డుల్లో సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం 'బెస్ట్ చిల్డ్రన్ అండ్ ఫ్యామిలీ ఫిల్మ్' కేటగిరీలో విజేతగా నిలవడమే కాకుండా బాఎ÷–టా గెలుచుకున్న తొలి భారతీయ సినిమాగా చరిత్ర సృష్టించింది. ఈ అద్భుత విజయం తర్వాత మేకర్స్ ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీతో పాటు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ప్రపంచ వేదికపై భారతీయ ప్రాంతీయ సినిమా సత్తాను చాటిన ఈ చిత్రం మార్చి 6న థియేటర్లలోకి రాబోతుంది. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ప్రముఖ నిర్మాతలు ఫర్హాన్ అక్తర్, రితేష్ సిధ్వానీ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించగా, లక్ష్మీప్రియ దేవి దర్శకత్వం వహించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే, మణిపూర్‌లోని ఒక మారుమూల గ్రామానికి చెందిన 'బూంగ్' అనే చిన్నారి చుట్టూ కథ తిరుగుతుంది. తన తల్లి ముఖంలో చిరునవ్వు చూడాలని తపించే ఆ బాలుడు, ఆమెకు ఇచ్చే అత్యంత విలువైన బహుమతి తన తండ్రిని తిరిగి ఇంటికి తీసుకురావడమేనని బలంగా నమ్ముతాడు. ఈ క్రమంలో తన స్నేహితుడితో కలిసి తండ్రి కోసం అతడు చేసే అన్వేషణ, ఆ ప్రయాణంలో ఎదురయ్యే అనుభవాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. దర్శకురాలు లక్ష్మీప్రియ దేవి చిన్నపిల్లల అమాయకత్వాన్ని, వారిలోని స్వచ్ఛమైన ప్రేమను అత్యంత సహజంగా వెండితెరపై ఆవిష్కరించారు.

# యశ్ టాక్సిస్ జూన్‌కి వాయిదా



యశ్ హీరోగా రానున్న తాజా సినిమా 'టాక్సిక్' గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. 'ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. భారీ స్థాయిలో రూపొందుతోన్న ఈ చిత్రం వాయిదా పడింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ ఓ పోస్ట్ పెట్టింది. మొదట ఈ మూవీని మార్చి 19న విడుదల చేయాలని భావించారు. కానీ, ప్రస్తుతం పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా దీన్ని జూన్ 4కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. 'మేం ఈ 'టాక్సిక్'ను అన్ని భాషల్లో విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్‌లోనూ రిలీజ్ చేయాలి. ప్రస్తుతం పశ్చిమాసియాలో పరిస్థితులు అందరికీ తెలిసినవే. ఇలాంటి సమయంలో సినిమాను విడుదల చేయడం సరైన నిర్ణయం కాదు. అందుకే వాయిదా వేస్తున్నాం' అని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఇక ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించ నుండగా హ్యూమా ఖురేషీ ఎలిజిబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా అలరించనున్నారు. మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో

# డి.ఈ.ఐ.సి కేంద్రం ప్రారంభం

**చిన్నారుల్లో వచ్చే లోపాలు, సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడమే లక్ష్యం**

**జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వెంకట రమణ**







**నంద్యాల, మార్చి 4, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ (డి.ఈ.ఐ.సి) ను ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వెంకట రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చిన్నారుల్లో జన్మతహ లోపాలు, శారీరక వైకల్యాలు, ఎదుగుదల, మానసిక సమస్యలు, వినికిడిమాట లోపాలు వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ డి.ఈ.ఐ.సి కేంద్రంలో 0 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, అవసరమైన చికిత్సలు, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, కౌన్సెలింగ్ వంటి సేవలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక నిపుణుల బృందం ద్వారా పిల్లల ఆరోగ్య పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, అవసరమైన చికిత్సా ప్రణాళిక రూపొందించనున్నామని తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గుర్తించిన పిల్లలను ఈ డి.ఈ.ఐ.సి కేంద్రానికి రిఫర్ చేసి మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా వైద్య శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఇది ఒక కీలక ముందడుగని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వెంకట రమణ విజ్ఞప్తి చేశారు.

## 50.వ సారీ బి నెగిటివ్

# రక్తదానం చేసిన రైతుబిడ్డ



**నంద్యాల బ్యూరో మార్చి మార్చి 4 (రిపబ్లిక్ న్యూస్):**
గోవింద్ దీన్నే గ్రామానికి చెందిన కర్నాటి ప్రతాప్ రెడ్డి గత పది సంవత్సరముల నుంచి అత్యవసర సమయాలలో గర్భిణీలకు,తల సేమియా పిల్లలకు, ప్రమాదాలు జరిగినప్పుడు బ్లడ్ గ్రూప్ బి నెగటివ్ రక్తదానం చేసి 50 మంది ప్రాణాలను కాపాడడం జరిగింది. రైతు కుటుంబంలో జన్మించి తన పనులు తాను చేసుకుం టు తనకు ఉన్న దాంట్లో పదిమందికి సహాయం చేయాలని ముఖ్య ఉద్దేశం అంతేకాకుండా కలగొట్ల గ్రామం నుంచి గోవింద్ నిన్నే గ్రామం వరకు ఇరువైపులా మొక్కలను నాటాడు. గ్రామంలోని లాక్ డౌన్ సమయంలో 50 మంది నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. అత్యవసర సమయాలలో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. కర్నాటి ప్రతాప్ రెడ్డి ని మనమందరం ఆదర్శంగా తీసుకొని మన వంతుగా ఆపద సమయాలలో రక్తదానం చేయడానికి మీ వంతుగా ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో మదర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బ్లడ్ మురళి, మదర్ యూత్ అసోసియేషన్ సభ్యుడు హుస్సేన్ వలి పేర్కొన్నారు.

## బేతంచెర్ల నూతన స్వేచ్ఛ రథం వాహనాన్ని ప్రారంభించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి



**బేతంచెర్ల ప్రతినిధి, మార్చి 04,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
బుధవారం రోజున,బేతంచర్ల మండల కేంద్రంలోప్లాస్టిక్ వ్యర్థాల సమర్థ నిర్వహణకు కీలకమైన చర్య ప్రారంభమైంది. ప్రతి ఇంటి నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించేందుకు ఏర్పాటు చేసిన నూతన "స్వచ్ఛ రథం" వాహనాన్ని డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డోన్ఎమ్మెల్యే మాట్లాడుతూ "తుక్కు ఇవ్వండిడ సరకులు తీసుకోండి" అనే నినాదంతో ఈ స్వచ్ఛ రథం ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తుంది. ప్రజలు తమ ఇంట్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను అందిస్తే, వాటి బదులుగా నిత్యావసర సరుకులను రథం సిబ్బంది అందజేస్తారు. సేకరించిన వ్యర్థాలను రీసైక్లింగ్‌కు పంపడం ద్వారా పర్యావరణ సంరక్షణకు ఈ కార్యక్రమం దోహదపడనుంది అని డోన్ఎమ్మెల్యే పేర్కొన్నారు,ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే దుష్ప్రభావాలను తగ్గించాలంటే ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజల చురుకైన భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే వ్యర్థాల సరైన నిర్వహణ తప్పనిసరిగా అమలు చేయాలని డోన్ఎమ్మెల్యే తెలిపారు ,ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో శుభ్రత మరింత మెరుగుపడటమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా గణనీయమైన తోడ్పాటు లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## ఈనెల 9నసీఎం చంద్రబాబు పర్యటనపైటిడిపి సమావేశం



**బేతంచర్ల ప్రతినిధి, మార్చి 04,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఈనెల 9న డోన్ మండలం కొత్తబుర్జు గ్రామంలో నిర్వహించనున్న నూతన పట్టాదారుల పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచ్చేయనున్న సందర్భంగా, బుధవారంరోజు బేతంచర్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు టిడిపి నాయకులతోమరియు కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించడం జరిగింది,డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై సీఎం ప్రోగ్రాం విజయవంతం చేయాలని చెప్పారు

# ఎంపీ నిధుల ఖర్చులో అలసత్వం వద్దు

**2024-26 అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో ఎంపీ బస్తిపాటి నాగరాజు సమీక్ష**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ మార్చ్ 4)**
కర్నూలు నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు జిల్లా అధికారులతో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీ నిధుల వినియోగం, చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతి, అమలు స్థితిగతులపై విస్తృతంగా చర్చించారు.సమావేశంలో సీ.పీ.ఓ, పంచాయితీ రాజ్, ఆర్.డబుల్యూ.ఎస్, ఏ.పి.ఈ.డబుల్యూ.ఐ.డి.సీ శాఖల అధికారులు పాల్గొన్నారు. 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి ఎంపీ నిధులతో చేపట్టిన పనులపై శాఖల వారీగా నివేదికలు సమర్పించారు.పనుల అమలులో ఎక్కడైనా జాప్యం ఉన్నట్లయితే వెంటనే సరిదిద్దాలని ఎంపీ ఆదేశించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా పూర్తి కావాలని స్పష్టం చేశారు. నిధుల ఖర్చులో అలసత్వం వహించవద్దని, పనుల నాణ్యతపై రాజీ పడకూడదని అధికారులను హెచ్చరించారు.ప్రతి పనిపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రగతి నివేదికలను సమయానికి అందజేయాలని సూచిస్తూ సమావేశం ముగిసింది.

## గుట్టపాడు గ్రామంలో నెలకొల్పనున్న

# బల్క్ డ్రగ్స్ పరిశ్రమ ను తక్షణమే నిలిపివేయాలి





**ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక డిమాండ్.**

**ఓర్వకల్ ప్రతినిధి, మార్చి 04,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
బుధవారం రోజున ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యం లో ఓర్వకల్లు లోని జీవేశ్వర ఆలయం కళ్యాణ మండపంలో " ప్రాణాంతక పరిశ్రమలు - అవగాహనా సదస్సు " అనే అంశంపై సదస్సు నిర్వహించబడింది. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షత వహించిన ఈ సదస్సుకు ముఖ్య వక్తగా జాతీయ అణు ఒప్పంద వ్యతిరేక వేదిక కార్యవర్గ సభ్యులు రవీంద్ర శర్మ, ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, రైతు సంఘం నాయకులు సుధాకర్, రాయలసీమ సాగునీటి సాధనా సమితి జిల్లా ఉపాధ్యక్షులు వాడాల చంద్రశేఖర రెడ్డి రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీంద్ర శర్మ మాట్లాడుతూ, గుట్టపాడు గ్రామంలో నెలకొల్పనున్న బల్క్ డ్రగ్స్ పరిశ్రమ వల్ల తీవ్ర పర్యావరణ సమస్యలు ఎదురవుతాయ ని, పరిశ్రమ వెలువరించే వ్యర్థ పదార్థాల వల్ల గాలి, నేల, నీరు కలుషితం అవుతాయన్నారు. అమ్మోనియా నైట్రేట్, ఇథనాల్ వేల లీటర్లలో నిల్వ చేయవలసి వుంటుందన్నారు. ఇంత వరకు పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు ఇవ్వలేదని, నెలకొల్పనున్న గ్రామాలలో పర్యావరణ ప్రభావం అంచనా సదస్సు లను నిర్వహించలేదని, ప్రభుత్వం ఎలాంటి నివేదికలు లేకుండానే అనుమతులు ఇచ్చిందని తెలిపారు. రెడ్ కేటగిరీ పరిశ్రమలకు తప్పని సరిగా గ్రామ పంచాయతీ తీర్మానంపై, కేంద్ర ప్రభుత్వం మాత్రమే అనుమతులు ఇవ్వాలని, అయితే రాష్ట్ర ప్రభుత్వం అన్ని నిబంధనలను ఉల్లంఘించి గుట్టపాడు గ్రామంలో సిగాచి పరిశ్రమకు అనుమతులు మంజూరు చేయడం మంచిది కాదని, తక్షణమే పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి జోక్యం చేసుకొని అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వేదిక కన్వీనర్ రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ ప్రాణాంతక రసాయన పరిశ్రమ లను ప్రజలు సామూహికంగా ఉద్యమించి, వాటి ఏర్పాటును నిలువరించాలని, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సమస్యను వివరించి, ఇలాంటి విష రసాయనాల పరిశ్రమల ఏర్పాటును వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. ఇంకా ఈ నాటి సదస్సులో సుంకన్న, రత్నం ఏసేపు, అబ్దుల్ వారిస్, విజయ భాస్కర్ రెడ్డి, జ×ఖ జిల్లా కార్యదర్శి రాధా కృష్ణ, మండల అధ్యక్షులు షాజహాన్ యోహాన్, రైతు సంఘం నాయకులు చంద్రబాబు నాయుడు వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగన్న అడ్వకేట్ జనార్ధన్, పౌర హక్కుల సంఘం నాయకులు కరీం బాషా మాట్లాడుతూ ఓర్వకల్లు మండలం గ్రామాలలోని ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలకు

# ఎంపికైన నంద్యాల జిల్లా క్రీడాకారుడు హిమ గణేష్

**. హైదరాబాదులో జరగనున్న ఏడవ జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొననున్న గణేష్.**

**. దివ్యాంగులను క్రీడలలో ప్రోత్సహిస్తాం: డాక్టర్ రవి కృష్ణ**

**నంద్యాల, మార్చి 04 (రిపబ్లిక్ న్యూస్) :**
నంద్యాల జిల్లా బనగానపల్లె లో వెటర్నరీ అసిస్టెంట్ గా పనిచేస్తున్న దివ్యాంగ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు హిమ గణేష్ విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలలో నంద్యాల జిల్లా తరపున పాల్గొని విజేతగా నిలిచి, హైదరాబాదులో ఆరవ తేదీ నుండి జరగనున్న ఏడవ జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలలో రాష్ట్ర జట్టు తరఫున పాల్గొనడానికి ఎంపికయ్యాడు.



ఈ సందర్భంగా నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, కార్యదర్శి ఎం.పి.వి. రమణయ్య హిమ గణేష్ ను శాలువా జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ గణేష్ జాతీయ స్థాయి పోటీలలో కూడా విజేతగా నిలిచి రాష్ట్రానికి, నంద్యాల జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. దివ్యాంగులు క్రీడలలో పాల్గొనాలని ఆసక్తి ఉన్నవారు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ను సంప్రదించాలని కోరారు. క్రీడలలో దివ్యాంగులను ప్రోత్సహిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంపీ వి రమణయ్య,కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి, సినీ, టీవీ నటులు ఎస్.ఆర్.ఎస్.ప్రసాద్, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, రిటైర్డ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అశోక్ కుమార్ యాదవ్, కళారాదన కార్యవర్గ సభ్యుడు శివరామిరెడ్డి, కార్యాలయ కార్యదర్శి ఆలా మధు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com